
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

కాకినాడ

జిల్లా వార్తలు

శుక్రవారం 28 నవంబరు 2025 | 3



అనుమానాస్పద వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలి

» మధ్యప్రదేశ్ దొంగల గ్యాంగ్ సంచారం

» జిల్లాలో అందరూ జాగ్రత్తగా ఉండాలి

» ఎస్పీ బిందుమాధవ్

5

పంచ సూత్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

» అడిషనల్ డైరెక్టర్ (హెల్త్) డాక్టర్ రజనీకుమారి

జీజీహెచ్(కాకినాడ),నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రైతుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు, పంచ సూత్రాలను తెలుసుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డైరెక్టర్(హెల్త్) డాక్టర్ ఎస్.రజనీకుమారి కోరారు. కాకినాడలో గురువారం మొబైల్ వెటర్నరీ అంబ్యులేటరీ యూనిట్‌ని జేడీ డాక్టర్ కృష్ణమూర్తితో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రైతన్నా మీకోసం కార్యక్రమం చేపట్టిందన్నారు. పశుసంవర్థకశాఖ ద్వారా పాలు, గుడ్లు, మాంసం రాష్ట్ర స్థూల విలువ పెంచేందుకు ఎంతో దోహదపడుతున్నాయన్నారు. ఈరంగాలను మరింత అభివృద్ధి చేసి ప్రోత్సాహం అందిస్తే పాడి రైతులు, రైతులు, రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. రైతులకు సహాయకారిగా నిలిచి పశువుల ఆరోగ్యాభివృద్ధిలో 1962 మొబైల్ వెటర్నరీ సేవలు కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా అంబులెన్స్ బృందం అందిస్తున్న సేవలను అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన డాక్టర్ బాల సువర్ణ, పి.బాలయోగి, పైలట్ శ్రీనులను అభినందించారు.



మొబైల్ యూనిట్‌ని సందర్శిస్తున్న డాక్టర్ రజనీకుమారి

ఫార్మాసిస్టులు వైద్యుల సూచన మేరకు మందులు పంపిణీ చేయాలి: డీఎంహెచ్‌వో

జీజీహెచ్(కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఫార్మాసిస్టులు డాక్టర్లు సూచించిన మేరకే మందులు పంపిణీ జరగాలని, రోగులకు కనిపించేలా మందుల పట్టిక ప్రదర్శించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ కోరారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఫార్మాసిస్టులకు గురువారం నిర్వహించిన రీఓరియంటేషన్ ట్రైనింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందులను సకాలంలో పోర్టల్‌లో నమోదు చేసి రోగులకు అందించాలన్నారు. మెయిన్ స్టోర్స్, సబ్ స్టోర్‌ల్లో మందులు ఈ ఏయుఎస్‌హెచ్ ఏడీహెచ్‌ఐ పోర్టల్ ద్వారా వెంటనే అప్‌లోడ్‌చేయాలన్నారు. 172 రకాల మందులు ఆస్పత్రిలో రోగుల కోసం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. కాలం చెల్లబోయే మందులను 6 నెలల ముందుగానే గుర్తించి వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీపీఎంయు డాక్టర్ జి.లక్ష్మి, ఫార్మసీ సూపర్‌వైజర్ కేవీ మంగ, పీహెచ్‌సీ ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.



రీ ఓరియంటేషన్ ట్రైనింగ్‌లో పాల్గొన్న డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్

మూడు కాదు.. నాలుగు!



నాలుగు జిల్లాలతో ఉమ్మడి తూర్పుగోదావరి

అడిగింది లేదనలేదు.. కోరింది కాదనలేదు.. ఆశలు ఫలించాయి.. ఆకాంక్షలు నెరవేరాయి.. గత వైసీపీ చేసిన తప్పులను సరిదిద్దుతూ సరికొత్త బాటలు వేశారు.. కొత్త సరిహద్దులు నిర్ణయించారు.. గిరిజనులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ఎక్కడో 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది..దీంతో ఇబ్బందులకు గురయ్యేవారు.. ఇది గమనించిన చంద్రబాబు ఏజెన్సీ వాసులకు ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.. ఈ మేరకు రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు.. ఇప్పటి వరకూ తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాలు మాత్రమే ఉండేవి. నాలుగో జిల్లాగా పోలవరం చేరింది. పెద్దాపురం నియోజకవర్గంలో ఉన్న సామర్లకోట కాకినాడ డివిజన్‌లో ఉండేది.. డివిజన్ కేంద్రం మార్చాలని ఏనాటి నుంచో విన్నపాలు చేస్తున్నారు.. కూటమి ప్రభుత్వం సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో చేర్చింది. మండపేట నియోజకవర్గం కోనసీమ జిల్లాలో ఉండేది. ఈ నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేశారు. ఈ మార్పులు..చేర్పులపై 30 రోజుల్లో అభ్యంతరాలు స్వీకరించనున్నారు.

» కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు

» జిల్లా కేంద్రంగా రంపచోడవరం

» 'తూర్పు'లో చేరిన మండపేట

» పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట

» నోటిఫికేషన్ విడుదల చేసిన సర్కారు

» 31 వరకు అభ్యంతరాల స్వీకరణ

నాలుగోది గిరిజన జిల్లా

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుతం మూడు కాదు.. నాలుగు జిల్లాలు. సీఎం చంద్రబాబు ఆమోదంతో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం జీవో నెం 1492తో గురువారం నోటిఫికేషన్ విడుదల చేసింది. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గుర్తేడు, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి మండలాలు.. చింతూరు డివిజన్ పరిధిలోని చింతూరు, కూనవరం, వీఆర్ పురం, ఎటపాక మండలాలను కలిపి ఈ కొత్త గిరిజన జిల్లాగా ఏర్పాటు చేస్తున్నారు. జిల్లాల ఏర్పాటు చట్టంలోని నిబంధనల మేరకు ప్రాథమిక ప్రకటనను జారీ చేసే అధికారాన్ని అల్లూరి జిల్లా కలెక్టర్‌కు కట్టబెడుతూ ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గురువారం నుంచి 30 రోజుల వ్యవధిలో ఈ ప్రతిపాదిత జిల్లా ఏర్పాటు విషయంలో తమకు ఉన్న అభ్యంతరాలు, మెరుగైన సూచనలను అల్లూరి జిల్లా కలెక్టర్‌కు రాతపూర్వకంగా తెలియపరచవచ్చు. గడువు ముగిసిన అనంతరం ప్రభుత్వం ఈ కొత్త జిల్లా ఏర్పాటును గెజిట్ రూపంలో ప్రకటించడం ఇక లాంఛనమే. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రంపచోడవరం, చింతూరు డివిజన్‌లోని ప్రజలకు జిల్లా కేంద్రానికి వెళ్లడానికి ఇంతవరకూ ఉన్న వందలాది కిలోమీటర్ల భారం తగ్గుతోంది.

పోలవరం లేని జిల్లా

పోలవరం పేరుతో ప్రకటించిన ఈ జిల్లాలో పోలవరం ప్రాంతానికి చోటే లేదు. ఈ జిల్లాకు పోలవరం అనే పేరు ప్రభుత్వం ఎందుకు పెట్టిందన్నది చర్చనీయాంశంగా మారింది. 30 రోజుల గడువు అనంతరం ఈ జిల్లా పరిధిలో పలు మార్పులు చోటు చేసుకునే అవకాశం ఉంది. ఈ కొత్త జిల్లా పరిధిలోనే పోలవరం ముంపు మండలాలు పూర్తిగా రెండు, పాక్షికంగా మూడు ఉండడం గమనార్హం. పోలవరం ప్రాజెక్టు కింద రంపచోడవరం, పోలవరం నియోజకవర్గాల పరిధి లోని ఉన్న ముంపు గ్రామాల గిరిజన నిర్వాసితులందరికీ కొత్త జిల్లా పరిధిలోనే పునరావాసం కల్పించే యోచన కూడా ప్రభుత్వానికి ఉందని తెలుస్తోంది.

ఇక పెద్దాపురంలోనే సామర్లకోట

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): సామర్లకోట మండలాన్ని ఇక నుంచి పెద్దాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలోకి చేరుస్తూ ప్రభుత్వం గురువారం రాత్రి గెజిట్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు జీవోఆర్‌టీ 1493 పేరిట గురువారం రాత్రి జిల్లా కేంద్రానికి, పెద్దాపురం, కాకినాడ ఆర్డీవో కార్యాలయాలకు ఉత్తర్వులు చేరాయి. మొదటి సార్వత్రిక ఎన్నికల నాడే పెద్దాపురం నియోజకవర్గంలో పెద్దాపురం,సామర్లకోట మండలాలు చేర్చినా పరిపాలనాపరమైన కార్యకలాపాలను మాత్రం పెద్దాపురం మండలం పెద్దాపురం ఆర్డీవో కార్యాలయ పరిధి, సామర్లకోట మండలం కాకినాడ ఆర్డీవో పరిధిలోను కేటాయించారు. ఎన్నికల నిర్వహణ మాత్రమే పెద్దాపురం ఆర్డీవో పరిధిలో పర్యవేక్షించేవారు.ఒకే నియోజకవర్గం మొత్తం మండలాలు ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలన్న కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు ఇక నుంచి సామర్లకోట మండల కార్యకలాపాలు పెద్దాపురం రెవెన్యూ డివిజన్‌లోకి అనుసంధానం కానున్నాయి.

'తూర్పు'న..మండపేట

రాజమహేంద్రవరం/మండపేట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ఉండే మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేస్తూ గురువారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ మేరకు డిసెంబరు 31 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించనున్నారు. ఇప్పటి వరకు ప్రజలు జిల్లా కేంద్రం అమలాపురం వెళ్లాలంటే ఇబ్బందులు పడేవారు. నియోజకవర్గం అంతా ఏకతాటిపై నిలబడి తూర్పులో విలీనం చేయాలని పోరాడారు. 2008 వరకు ఆలమూరు నియోజకవర్గం రాజమహేంద్రవరం పార్లమెంట్‌లోనే ఉండేది. 2009లో నియోజకవర్గ పునర్విభజన సమయంలో ఆలమూరు నుంచి విడిపోయి మండపేట నియోజకవర్గం ఏర్పడింది. అప్పుడు ఆలమూరు కొత్తపేట నియోజకవర్గంలో కలవగా మండపేట నియోజకవర్గంలో అనపర్తి నియోజకవర్గం పరిధిలోని రాయవరం మండలం ఇక్కడ కలిసింది. 2009లో ఏర్పడిన మండపేట నియోజకవర్గం 16 ఏళ్ల తర్వాత తిరిగి ఇప్పుడు తూర్పుగోదావరి జిల్లాలో చేరింది. మండపేట నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు ఒక మునిసిపాలిటీ ఉంది. 42 పంచాయతీలు ఉన్నాయి. మండపేట మునిసిపాలిటీ, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలాలు ఉన్నాయి. నియోజకవర్గ జనాభా 3.45 లక్షలు ఉండగా ఓటర్లు 2.20 లక్షలు మేర ఉన్నారు. జిల్లాలో 21 మండలాలు ఉంటాయి.రాజమండ్రి మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు మండపేట, కొవ్వూరు, నిడదవోలు మునిసిపాలిటీలు,జిల్లా అర్బన్, గ్రామీణ ప్రాంతాలు ఉంటాయి.

'యాప్ర్'మత్తం!



హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) యాప్

» వసతిగృహాల పనితీరుపై సర్కారు నిఘా

» హాస్టల్ వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూల చేతికి హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్)

» రోజువారీ కార్యకలాపాలు ఫొటో తీసి పంపేలా మార్గదర్శకాలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ సక్రమంగా జరిగేలా సర్కారు అడుగులేస్తోంది. అక్కడ తరచూ జరుగుతున్న అవాంఛనీయ సంఘటనలపై దృష్టిసారిస్తోంది. ముఖ్యంగా హాస్టళ్లలో వార్డెన్ల పనితీరును గాడిన పెట్టే చర్యలు చేపడుతోంది. వార్డెన్లను దారికి తెచ్చేందుకు, హాస్టళ్లలో ఏ చిన్న పొరపాట్లు, అవకతవకలకు ఆస్కారం లేకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. ఇందుకోసం కృత్రిమ మేధ, సాంకేతితతో కూడిన ప్రత్యేక యాప్‌ను ప్రవేశపెట్టింది. ప్రతి చిన్న పనిని దీని ద్వారా ఫొటో తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. గృహాల్లోని కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకతకు ఇది అందుబాటులోకి తెచ్చింది.

ఇటీవల కాలంలో వసతిగృహాల్లోని పరిస్థితులు కలవరపెడుతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లా రాజేంద్రపాలెం గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థినులు అస్వస్థతకు గురవ్వడంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోర్టు ప్రశ్నించడం ఈ నేపథ్యంలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షించిన సీఎస్ హాస్టల్ వార్డెన్లు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన అధికారులు హాస్టల్ పర్మినెంట్ ట్రాకింగ్ సిస్టం(హెచ్‌పీటీఎస్) పేరుతో అందుబాటులోకి తెచ్చిన యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారు.

వార్డెన్లదే బాధ్యత

హాస్టల్ ఉన్న ప్రతిచోటా ఈ యాప్‌ను వినియోగించి రోజువారీ కార్యకలాపాలు ఫొటో తీసి పంపేలా మార్గదర్శకాలు జారీ అయ్యాయి. గృహాల్లోని ఆహార ప్లేట్లు కడగడం నుంచి, పిల్లల హాజరు, భోజనాలు, వండిన పదార్థాలు, ఆవరణ, గదులు, తాగునీరు, మరుగుదొడ్ల శుభ్రత తదితర అన్నీ యాప్ ద్వారా ఉన్నతాధికారుల పరిశీలనకు ఎప్పటికప్పుడు చేరుతునాయి. దీంతో ఎక్కడ చిన్న పొరపాటు జరగకుండా వార్డెన్లు అన్ని జాగ్రత్తలు తీసుకోవడానికి ఆరాటపడుతున్నారు. ఇటీవల కాకినాడ కొండయ్యపాలెం సమీపంలో ఉన్న ఎస్సీ వసతిగృహంలో కొందరు విద్యార్థులు గోడలకు రంగులు వేస్తూ కనిపించారు. ఇలాంటి సంఘటనలు కూడా ఈ యాప్ ద్వారా ఉన్నతాధికారులకు చేరే అవకాశం ఉంది.

ఏఐతో నిఘా

ఏఐతో హాస్టళ్లలో అక్రమాలు బయటపడనున్నాయి. భోజనాలకు ఫొటోతీస్తే అప్పటికే నమోదైన విద్యార్థుల సంఖ్యకు ఆ ఆహారం సరిపోతుందా లేదా అనే విషయాన్ని లెక్కగట్టి ఏఐ తెలియజేస్తోంది. పదార్థాల నాణ్యత పక్కాగా ఉన్నదీ, లేనిది స్పష్టమవుతోంది. ఇలాగే అన్ని విషయాల్లోనూ ప్రమాణాలు గుర్తించనున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణతో వీటిల్లో ఏ అవకతవకలు గుర్తించినా సంబంధిత ఉద్యోగులపై వేటు తప్పదంటున్నారు. జిల్లాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలు 33 కాగా, బీసీ వసతిగృహాలు 42 వరకు ఉన్నాయి. వీటిలో పనిచేసే వార్డెన్లు, ఏఎస్‌డబ్ల్యూఓలు యాప్‌ను లోడు చేసుకొని అన్నింటిని ఫొటోలు తీస్తున్నారని జిల్లా సాంఘిక సంక్షేమాధికారి తెలిపారు.

పనులు చేయకుండానే..

బిల్లుల చెల్లింపు

» నిర్వహణలో నాణ్యతకు తిలోదకాలు

» పిఠాపురం పురపాలక సంఘంలో నిధులు దుర్వినియోగం

» విజిలెన్స్ విచారణలో నిర్ధారణ

» ఐదుగురు అధికారులపై చర్యలకు ప్రభుత్వం ఆదేశం

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పనులు చేయకుండానే బిల్లులు చెల్లించడం, నిర్వహణలో నాణ్యత ప్రమాణాల పాటించకపోవడం ద్వారా పిఠాపురం పురపాలక సంఘంలో ఇంజనీరింగ్ అధికారులు నిధులు దుర్వినియోగానికి పాల్పడినట్లు విజిలెన్స్ విచారణలో నిర్ధారణ కావడంతో చర్యలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ వ్యవహారమంతా సాగింది.



పనుల నిర్వహణపై తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

పిఠాపురం మునిసిపాలిటీకి 2019-20 ఆర్థిక సంవత్సరంలో 14వ ఆర్థిక సంఘం ద్వారా 55 పనుల నిర్వహణకు రూ.773.44లక్షలు మంజూరయ్యాయి. ఇందులో 36 పనులకు సాంకేతిక ఆమోదం లభించగా 30పనులకు వర్క్ అగ్రిమెంట్లు జరిగాయి. ఇందులో రూ.301.93లక్షల విలువైన 28 పనులను ప్రారంభించి పూర్తి చేశారు. ఇందులో రోడ్లు, డ్రైన్లు, తాగునీటి పైప్ లైన్ పనులు తదితరాలు ఉన్నాయి. పలు పనులు చేయకుండానే బిల్లులు కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేయడం, పనుల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా నాసిరకంగా చేసినట్లు ఆరోపణలు అప్పట్లో వెలువెత్తాయి. కాంట్రాక్టర్లు, ఇంజనీరింగ్ అధికారులు కుమ్మక్కయి భారీగా నిధులను పక్కదారి పట్టించారు. దీనిపై ఆంధ్రజ్యోతి దినపత్రికలో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. రూ.కోటి నిధులు దుర్వినియోగమయ్యాయని, పనులు చేయకుండానే చేసినట్లు ఎంబుక్‌లో రికార్డు చేసి తమకు అనుకూలంగా ఉన్న కాంట్రాక్టర్లుకు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు చెల్లించారని, అంచనాలను అధికంగా రూపొందించారని, సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణంలో నాణ్యత పాటించలేదని, నాసిరకం మెటిరీయల్ వాడారని తదితర విషయాలను బయటపెట్టింది. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణ పరిధిలో పలు పనులను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు.పనుల నిర్వహణలో లోపాలను గుర్తించారు. పనులు చేయకుండానే బిల్లులు చెల్లించినట్లు,పలుపనుల్లో నాణ్యత లేనట్లు విజిలెన్స్ విచారణలో వెల్లడైంది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. దీని ఆధారంగా పురపాలక సంఘంలో గతంలో ఏఈలుగా పనిచేసిన పి.వంశీ అభిషేక్, కె.రత్నవల్లి, డీఈఈలు ఎస్.భవానీశంకర్, ఎంటీ హుస్సేన్, పబ్లిక్ హెల్త్ ఈఈ వైఎస్ఆర్‌కేవీవీ ఎల్.నరసింహారావుపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశిస్తూ గురువారం రాత్రి జీవో నెంబరు 1339 జారీ చేశారు. నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ ముఖ్య కార్యదర్శి సురేష్ ఆదేశించారు.

కాకినాడ ఎంపీతో ప్రత్తిపాడు ఎమ్మెల్యే భేటీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం కాకినాడ ఎంపీ క్యాంపు కార్యాలయంలో కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసుతో భేటీ అయ్యారు. ప్రత్తిపాడు నియోజకవర్గం అభివృద్ధిపై ఇద్దరూ చర్చించారు. నియోజక వర్గంలో నూతన రహదారులు, కొత్త ఆస్పత్రుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఆమె కోరారు. పెద్దమల్లాపురం కేంద్రంగా నూతన ఐటీడీఏ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపైన కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గం టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా 'ఎస్ఐఆర్'పై ఎన్నికల అధికారి సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా స్పెషల్‌ఇంటెన్సీరివిజన్(ఎస్ఐఆర్), ఇతర ఎన్నికల అంశాలపై గురువారం ఏపీ చీఫ్ ఎలక్టోరల్ అధికారి వివేక్‌యాదవ్ వెలగపూడి నుంచి అన్నిజిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌వోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఏఈఆర్‌వో, బూత్‌లెవెల్ అధికారుల శిక్షణా కార్యక్రమాలు, ఎస్ఐఆర్ జాబితా మ్యాపింగ్, బీఎల్వోలకు ఐడీకార్డుల పంపిణీ, ఎపిక్ కార్డులు పంపిణీ, పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్ వంటి అంశాలపై వివేక్‌యాదవ్ సమీక్షించారు. ఈ సమావేశానికి కాకినాడ కలెక్టరేట్ నుంచి కలెక్టర్ షాన్‌మోహన్ హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సీ రివిజన్ కార్యకలాపాలు సజావుగా నిర్వహించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. దీనికి ఈఆర్‌వో, బీఎల్వోలకు ఈనెల 25నాటికి శిక్షణా కార్యక్రమాలు పూర్తి చేశామన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా బీఎల్వోలకు 2002, 2025 ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియ 37.53శాతం పూర్తయిందన్నారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 1640 బూత్ లెవెల్ అధికారులకు 1624మందికి బీఎల్వో ఐడీకార్డులు పంపిణీ చేశామన్నారు. ఫారం పెండింగ్‌కు సంబంధించి 147 క్లెయిమ్‌లను సకాలంలో పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. జిల్లాలో ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలింగ్ కేంద్రాల రేషనలైజేషన్‌లో భాగంగా 185 పోలింగ్ కేంద్రాలు కొత్తగా ప్రతిపాదించామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు, బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

జలజీవన్ మిషన్‌తో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

» ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): జలజీవన్ మిషన్‌తో అన్ని గ్రామాల్లో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, అన్ని గ్రామాలకు గోదావరి జలాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం రూ.1650కోట్లతో ధవళేశ్వరం ఎగువ గోదావరినుంచి పైప్‌లైన్లు జిల్లా వరకూ వేయనున్నట్లు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తెలిపారు. సామర్లకోట మండలం పి.వేమవరం, పనసపాడుల్లో జలజీవన్‌మిషన్ నిధులు రూ.49.50లక్షలతో పూర్తిచేసిన 40వేలలీటర్ల పరిమాణంగల ఓవర్‌హెడ్ ట్యాంకును ఎంపీ ఉదయ్ శ్రీనివాస్, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల బాబుతో కలిసి ఎమ్మెల్యే గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండేందుకు కలుషితం లేని తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ మేరకు కేంద్రం నిధులు సమకూరుస్తుందన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు మురిరెడ్డి శ్రీరాములు, పనసపాడు సర్పంచ్ చీకట్ల వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో ఏర్పాటు చేయనున్న వాటర్‌గ్రిడ్ పథకం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప భూమిపూజలు చేశారు. రెండేళ్లలో పథకం పూర్తి చేసి వాటర్‌గ్రిడ్ ద్వారా సామర్లకోట మండలం లోని అన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ గోదావరి జలాలు తాగునీటిగా శుద్ధి చేసి సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఈ పథకాలు ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో త్వరతగతిన పూర్తిచేయనున్నట్లు ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. ఎంపీడీవో కరక హిమమహేశ్వరి,ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ ఎస్ఎంఎస్ స్వామి, ఏఈ సుభాషిణి, వెంకటేష్, శ్రీరాములు, బీజేపీ ఇన్‌చార్జి వెంకటరమణ పాల్గొన్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంకును ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు

నియమాలు పాటించని లారీలపై 577 కేసులు.. రూ.68 లక్షల జరిమానా

» ఇవి ఈ ఏడాది మొత్తం కేసులు

» కత్తిపూడి వెహికల్ ఇన్‌స్పెక్టర్

రౌతులపూడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): నియమాలు పాటించని లారీలపై ఈ ఏడాది 577 కేసులు నమోదు చేసి 68 లక్షల జరిమానా విధించామని కత్తిపూడి వెహికల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. రౌతులపూడిలో నిబంధనలు పాటించని లారీలను తనిఖీ చేశారు. ఇప్పటివరకూ 577 కేసులు నమోదు చేసి రూ.68లక్షలు జరిమానా విధించినట్టు తెలిపారు. రౌతులపూడినుంచి రవాణా చేస్తున్న లాటరైట్, నల్లరాయి తరలించే సమయంలో నిబంధనలు పాటించని లారీలపైనే ఇప్పటి వరకూ 116 కేసు నమోదు చేసి రూ.16లక్షలు జరిమానా విధించినట్టు తెలిపారు. నిరంతరం తనిఖీలు చేస్తున్నామని, లారీలు నియమాలు పాటించాలన్నారు.

నేటి నుంచి దత్త జయంతి, సప్తాహ మహోత్సవాలు

4

డొంకరాయిలో సినీ సందడి

ట్రాక్టర్‌ను ఢీకొన్న ఆటో

5

» మహిళ మృతి

» చింతూరులో సంతకు వెళ్తొస్తుండగా ఘటన


కరప మండలం పెద్దాపురప్పాడులో నాటిన జామ మొక్క

చిన్నారులకు విద్యాబుద్ధులే కాదు... విలువలతో కూడిన అంశాలపైనా అవగాహన కల్పించాలి. చిన్నప్పటి నుంచే సమాజంపై అవగాహన తీసుకురావాలి. అందుకు తగ్గట్టుగానే అంగన్వాడీ కేంద్రాలు పని చేస్తున్నాయి. మాతాశిశు రక్షణ కోసం ఏర్పాటుచేసిన ఇవి నేడు చిన్నారులకు పాఠాలు నేర్పించడంతో పోషక విలువలు సమృద్ధిగా ఉండే ఆహారం అందిస్తున్నాయి.


కాకినాడ రూరల్ మండలం తూరంగిలో అరటి చెట్టు

అద్భుత ఫలాలు

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార వాటికలు

» ఆకుకూరలు, పండ్ల తోటల పెంపకం » వాటితోనే బాలింతలు, గర్భిణులకు పోషకాహారం తయారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ జిల్లాలో 1,886 అంగన్వాడీ స్కూళ్లు ఉన్నాయి. వీటి ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్నారు. వారి ఆరోగ్య సంరక్షణకు అనేక చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం ఇవి అంగన్వాడీ ఆరోగ్య రక్షణ కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. అంగన్వాడీ కేంద్రాల ఆవరణలో పోషకాహారం కలిగే ఉండే ఆకుకూరలు, కూరగాయల సాగు చేపడుతున్నారు. పండ్ల మొక్కలను పెంచుతున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతూ ఇందుకు అవసరమైన ప్రోత్సాహం అందిస్తోంది. 488 కేంద్రాల్లో ఈ తరహా పోషణ వాటికలు ఏర్పాటు చేశారు.



అంగన్వాడీ కేంద్రాల్లో మూడు నుంచి ఆరేళ్ల లోపు చిన్నారులకు విద్యాబుద్ధులు నేర్పించడంతో పాటు పోషకాలు అధికంగా ఉండే ఆకుకూరలు, కూరగాయలతో వండిన మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. ఇటీవల వ్యవసాయంలో రసాయనాల వాడకం పెరిగిపోవడంతో ఆకుకూరలు, కూరగాయలు విషతుల్యమవుతున్నాయి. ధరలు కూడా ఆకాశాన్నంటుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాల్లో పలు రాకల ఆకుకూరలు, కూరగాయలను సేంద్రియ విధానంలో సాగు చేసే చర్యలు చేపట్టారు. తోటకూర, పాలకూర, గోంగూర వంటి ఆకుకూరలతో పాటు అరటి, బెండకాయ, వంకాయ, టమాటా పండిస్తున్నారు. ఖాళీ స్థలం ఉన్న చోట అరటి, దానిమ్మ, జామ వంటి పండ్ల మొక్కలు వేశారు. అవి ఫలాలు అందిస్తున్నాయి. స్థలాలు అనువుగా ఉన్న కేంద్రాల్లో తొలి విడత ఏర్పాటు చేసిన పోషణ వాటికలు సత్ఫలితాలు అందిస్తున్నాయి. ఈ ఉత్పత్తులను గర్భిణులు, బాలింతలకు అందజేస్తున్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కేంద్రాల్లో పోషణ వాటికలు ఏర్పాటు చేయనున్నారు. విటమిన్లు అందించే పండ్ల మొక్కలతో పాటు ఔషధ గుణాలున్న మొక్కలూ పెంచేందుకు చర్యలు చేపడుతున్నారు.


కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని అంగన్వాడీ కేంద్రంలో పండిస్తున్న గోంగూర, గోరుచిక్కుడు కాయలు


అంగన్వాడీ కేంద్రం ఆవరణలో పండిన పండ్లతో చిన్నారులు

సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడు

ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు


భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న కోటేశ్వరరావు, సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు



గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శివుడు మాదిరిగానే సుబ్రహ్మణ్యేశ్వరుడు ఆకాశ తేజసుడని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఆలవెల్లి మల్లవరంలోని స్వయంభూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో నూతనంగా నిర్మించిన సంతాన శయన మందిరాన్ని ఆయన గురువారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శివ తేజస్సు వలనే బంగారం, వెండి ఇతర లోహాలు పుట్టుకొచ్చాయని, సుబ్రహ్మణ్యేశ్వరుని ఉత్పత్తి సమయంలో ఇది జరిగిందని తెలిపారు. స్వామికి పూజ చేయడమంటే భూమి అంతటికీ పూజ చేయడమేనని చెప్పారు. భూమి శాప విముక్తి కోసమే సుబ్రహ్మణ్యేశ్వరుడు జన్మించాడని తెలిపారు. సుబ్రహ్మణ్యేశ్వరుడు పంచభూత స్వరూపడని, అగ్ని నుంచి పుట్టాడు కాబట్టి అగ్ని స్వరూపడయ్యాడని చెప్పారు. దీపాన్ని వెలిగించడం, హారతి ఇవ్వడం ఆయనకు అత్యంత ప్రీతికరమన్నారు. అనంతరం చాగంటి దంపతులను ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కడిమిశెట్టి కుమార భాస్కరరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆత్కూరి దక్షిణామూర్తి, కార్యదర్శి కడిమిశెట్టి విజయభాస్కరరెడ్డి, సంయుక్త కార్యదర్శి అబ్బిరెడ్డి అప్పారావు, కోశాధికారి ఆకొండి విశ్వనాథం, సభ్యులు కడిమిశెట్టి వెంకటరావు, అరిగెల రామయ్యదొర, పాలపర్తి చలమయ్య, రాయవరపు ఆదినారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

'పాడా' ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణి బదిలీ



పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం ప్రాంత ప్రాధికార అభివృద్ధి సంస్థ (పాడా) ప్రాజెక్టు డైరెక్టర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.చైత్రవర్షిణి బదిలీ అయ్యారు. ఆమెను గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనరు కార్యాలయంలోని మైక్రో క్రెడిట్ విభాగం స్పెషల్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. తక్షణం రిలీవ్ చేయాలని సూచించారు. పాడా తొలి రెగ్యులర్ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆమె వ్యవహరించారు. ఆరోగ్య కారణాలతో ఇటీవల పలుమార్లు సెలవుపై వెళ్లారు. ఆరోగ్య కారణాల రీత్యా తనను బదిలీ చేయాలని ఆమె చేసిన విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కొత్తగా ఎవరినీ నియమించలేదు.



లక్ష్మీగౌతమ్, తమన్‌లను అభినందిస్తున్న శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్

బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ... ఏపీ క్రికెట్ జట్టుకు 'శ్రీప్రకాష్' విద్యార్థుల ఎంపిక

కాకినాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బీసీసీఐ విజయ్ మర్చంట్ క్రికెట్ ట్రోఫీ కోసం ఏపీ క్రికెట్ జట్టుకు శ్రీప్రకాష్ సినర్జీ స్కూలుకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్టు శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి 11వ తరగతి విద్యార్థి జి.లక్ష్మీగౌతమ్, 10వ తరగతి విద్యార్థి కె.తమన్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ క్రికెట్ జట్టుకు తమ విద్యార్థులు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో పాటు కోచ్ జి.దుర్గాప్రసాద్‌ను ఏపీ క్రికెట్ సంఘ కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, విజయ్‌ప్రకాష్, జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు తలాటం హరీష్, కార్యదర్శి నక్కా వెంకటేష్, సంయుక్త కార్యదర్శి సమీరా మెమెంటోలతో సత్కరించి అభినందించారు.

నేటి నుంచి దత్త జయంతి

సప్తాహ మహోత్సవాలు

మహా సంస్థానంలో వచ్చే నెల 4 వరకు ప్రత్యేక పూజలు


పిఠాపురంలోని శ్రీపాదశ్రీవల్లభులు, దత్తాత్రేయస్వామి, నృసింహసరస్వతి

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

దేశవ్యాప్తంగా శ్రీపాదశ్రీవల్లభుల జన్మస్థానంగా ప్రసిద్ధిగాంచిన కాకినాడ జిల్లా పిఠాపురంలోని శ్రీపాద శ్రీవల్లభ మహా సంస్థానంలో శుక్రవారం నుంచి దత్త జయంతి సప్తాహ మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. డిసెంబరు 4వ తేదీ వరకు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా పలు ప్రత్యేక పూజలు, స్వాములకు విశేష అలంకారాలు చేస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలిరానున్న దృష్ట్యా ఆలయాధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతి రోజూ మహా గణపతి పూజ, కలశస్థాపన, శత రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, వేదపారాయణ, మూలమంత్ర అనుష్టానం, శీర్ష ఉపనిషత్ పారాయణ, గురుచరిత్ర, శ్రీపాద శ్రీవల్లభ చరితామృత పారాయణ, సాయంత్రం 4 గంటలకు అగ్నిప్రతిష్ఠాపన, దత్తమంత్ర హోమం, 5 గంటలకు హారతులు, పల్లకీ సేవ, సాయంకాలార్చన, మంగళహారతి జరుపుతారు. అలాగే ప్రతిరోజూ గోపూజ, అభిషేకం, రుద్రాభిషేకం, దత్త హోమం, వెండి పల్లకీ సేవ, దత్త జయంతి రోజున ఊయల సేవ జరుగుతాయి.

రోజువారీ పూజలు.. శుక్రవారం దత్తాత్రేయ స్వామికి గ్రామోత్సవం, సర్వపుష్పపూజ, 29న లక్ష బిల్వార్చన, 30న సహస్ర చామంతి పూజ, డిసెంబరు 1న లక్ష తులసి అర్చన, 2న సహస్ర లిల్లీ పుష్ప పూజ, 3న గులాబి అర్చన, సంపెంగ పుష్ప పూజ, 4న పూలంగి సేవ, బిల్వార్చన, పూర్ణాహుతి జరుగుతాయి. దత్త జయంతి రోజు సాయంత్రం రథోత్సవం నిర్వహిస్తారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, కర్ణాటక, గోవా, పశ్చిమ బెంగాల్, ఒడిశాల నుంచి భక్తులు అధికంగా తరలివస్తారు.

పాదగయ క్షేత్రంలో ఇలా..

పిఠాపురంలోని పాదగయ క్షేత్రంలో స్వయంభూ దత్త జయంతి సప్తాహ ఉత్సవాలు శుక్రవారం ప్రారంభం కానున్నాయి. వేదోక్త విధి ననుసరించి దత్తాత్రేయ మంత్రానుష్టానము, హోమాలు, గురుచరిత్ర, వేద పారాయణా, యతిపూజ, లక్ష బిల్వార్చన, సత్యదత్త వ్రతాదులచే సప్తాహ దీక్షతో ఉత్సవాలు నిర్వహిస్తారు. డిసెంబరు 4 వరకు జరిగే ఉత్సవాల సమయంలో ప్రతిరోజూ మహా గణపతి పూజ, రుత్విక్ వరణలు, ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర నామార్చన, మంగళహారతి, మంత్రపుష్పం, శీర్ష ఉపనిషత్, వేదసూక్తాలు, మూలమంత్రాలు, దత్త మూలమంత్రం, జపాలు, సామూహిక గురుచరిత్ర పారాయణ జరుగుతాయి. మధ్యాహ్నం దత్తమూల మంత్రహోమాలు, సాయంత్రం సాయంకాల విశేష పుష్పార్చన నిర్వహిస్తారు. తొలి రోజైన శుక్రవారం సహస్ర కలువ పుష్పార్చన, 29న సహస్ర తామర పుష్పార్చన, 30న లక్ష బిల్వార్చన, డిసెంబరు 1వ తేదీన సహస్ర గులాబీ అర్చన, 2న సహస్ర చామంతి పుష్పార్చన, 3న లక్ష తులసి అర్చన 4న సర్వపుష్పార్చన, సాయంత్రం దత్తాత్రేయుడికి ఊయల సేవ జరుగుతాయి.

అన్ని సౌకర్యాలు కల్పించాం

పాదగయ క్షేత్రంలో జరిగే దత్త జయంతి సప్తాహ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చే భక్తులు, దత్తమాలధారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. వారం పాటు ప్రత్యేక పూజలు, దత్త జయంతి రోజున విశేష కార్యక్రమాలు జరుగుతాయి.

-కాట్నం జగన్మోహన శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి, పాదగయ క్షేత్రం.


పిఠాపురం పాదగయ క్షేత్రంలోని స్వయంభూ దత్తాత్రేయస్వామి

3న ఇరుముడి ధారణ

దత్తమాల ధరించి మండల, అర్ధ మండల, సప్తాహ దీక్ష చేసిన భక్తులకు డిసెంబరు 3న ఇరుముడి ధారణ, దత్తస్వాముల నగరోత్సవం నిర్వహిస్తారు. 4వ తేదీ తెల్లవారుజామున దత్త దీక్ష విరమణ, ఇరుముడి సమర్పణ, మహా పూర్ణాహుతి, మహాపూజ జరుగుతాయి.

ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

దత్త జయంతి మహోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేశాం. సులభతరంగా దర్శనమయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఉచిత అన్నప్రసాద వితరణ చేస్తాం.

-ఆర్.సౌజన్య, కార్యనిర్వహణాధికారి, శ్రీపాదశ్రీవల్లభ మహా సంస్థానం

ఉమ్మడి జిల్లా ఖోఖో జట్టు ఎంపిక


ఉమ్మడి జిల్లా ఖోఖో అండర్-14 జట్టుతో ఎంఈవో సత్యరంగారావు

సర్పవరం జంక్షన్, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-14 ఖోఖో జట్టు ఎంపికను కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ ఏపీఎస్పీ జడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించారు.స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మూడు రోజులుగా ఖోఖో అండర్-14 తుది జట్టు 12 మంది సభ్యుల ఎంపిక కోసం ఈ నెల 23 నుంచి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లా, ఏఎస్ఆర్ జిల్లాల పరిధిలో ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో రాణించిన 12 మంది సభ్యులను ఖోఖో తుది జట్టుగా ఎంపిక చేసినట్టు ఎంఈవో-1 తుమ్మల సత్యరంగారావు తెలిపారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా జట్టు సభ్యులకు స్పోర్ట్స్ టీషర్ట్‌లను అందించారు. విశాఖలో ఈ నెల 28 నుంచి 30వరకు జరిగే అంతర జిల్లాల పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన జట్టు సభ్యులను ఇన్‌చార్జి హెచ్‌ఎం మూర్తి అభినందించారు.కార్యక్రమంలో వ్యాయామోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, పీఈటీలు హరిబాబు, త్రిమూర్తులు, కిరణ్‌కుమార్, సుప్రియ పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం చిత్తశుద్ధితో ఉంది

కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం పరిరక్షణపై కేంద్ర ప్రభుత్వంతో చిత్తశుద్ధితో ఉందని భారీ పరిశ్రమలశాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ స్పష్టం చేశారు. అయినా పదేపదే తమ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తూ, విమర్శిస్తూనే ఉంటే అలాంటి వారి చిత్తశుద్ధిని తాము అనుమానించాల్సి ఉంటుందన్నారు. గురువారం రాజమహేంద్రవరంలోని ఒక హోటల్లో బీజేపీ గోదావరి జోన్ మండలాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ తరగతులకు ఆయన విచ్చేసి మాట్లాడారు. విశాఖ ఉక్కు కర్మాగారం కోసం రూ.11,500 కోట్ల ప్యాకేజీ మంజూరు చేయడమే తమ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు. విశాఖ ఉక్కు సెంటిమెంట్‌ను సీఎం చంద్రబాబు.. కేంద్ర మంత్రి అమిత్‌షా, ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు చెప్పడం ద్వారా ప్యాకేజీ సాధించామని పేర్కొన్నారు.


కన్నుల పండువగా సుబ్రహ్మణ్యుడి రథోత్సవం


శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి రథోత్సవం

బిక్కవోలు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలులోని శ్రీకుమారసుబ్రహ్మణ్యస్వామి షష్ఠి మహోత్సవాల్లో రెండో రోజైన గురువారం స్వామి వారి రథోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. మధ్యాహ్నం 1.17 గంటలకు స్వామి వారిని మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ రథంలో వుంచారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు పల్లి శ్రీనివాసరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం రథం లాగి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథం ముందు నిర్వహించిన కోలాటాలు, బ్యాండు మేళాలు, కేరళ వాయిద్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. స్వామి ఆలయం నుంచి వంగా వారి వీధి మీదుగా బిక్కవోలు మెయిన్‌రోడ్, రాజారావుపేట రోడ్ వరకూ వెళ్లి ఆలయం వద్దకు చేరింది. ఉత్సవ కమిటీ సభ్యులు పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, పల్లి రాజారెడ్డి, సింగారపు రామారావు, గుణ్ణం రమేష్ చౌదరి, త్రిమూర్తులు, కొమ్మోజు శ్రీను పాల్గొన్నారు. డీఎస్పీ విద్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

బాణసంచా కాల్పుల కనువిందు..

షష్ఠి మహోత్సవం సందర్భంగా బుధవారం అర్ధరాత్రి కాల్చిన బాణసంచా వీక్షకులను కనువిందు చేసింది. గ్రామానికి చెందిన గోలింగేశ్వర ఫైర్ వర్క్స్, కనకదుర్గ హంస్సేనియా ఫైర్ వర్క్స్ వారు పోటా పోటీగా బాణసంచాను స్థానిక హైస్కూలు గ్రౌండులో కాల్చారు. ఈ సందర్భంగా ఆకాశంలో వెలుగులు వెదజల్లే బ్యాటరీ బాక్సులు, నిప్పులు చెలరేగే సర్పాలు, ఈతచెట్లు, మల్లెపందిరిలు, సెర్చిలైట్లు, విష్ణు, సూర్య చక్రాలు, అందర్నీ ఆకట్టుకున్నాయి.


బాణసంచా కాల్పులో నిప్పులు గక్కుతున్న సర్పం

బూత్ స్థాయి నుంచి బీజేపీ బలోపేతం

పార్టీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్‌లో రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్


బీజేపీ గోదావరి జోన్ ప్రశిక్షణ వర్గ్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న రాష్ట్రాధ్యక్షుడు మాధవ్

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్ ఆధారంగా రాష్ట్రంలో బీజేపీని పటిష్ఠం చేయడంతోపాటు కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక సమస్యలపై ఉద్యమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ఒక హోటల్‌లో జరిగిన బీజేపీ గోదావరి జోన్ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల ప్రశిక్షణ వర్గ్‌లో ఆయన మాట్లాడుతూ కలసి పని చేయడానికి ఈ శిక్షణా తరగతులు ప్రేరణగా నిలుస్తాయి అన్నారు. మండల నాయకులు పార్టీ తరఫున క్రియాశీలకంగా వ్యవహరించాలని, కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్లాలని అన్నారు. వాడ వాడలా పార్టీ పతాకాలు ఎగరాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ మాట్లాడుతూ ప్రశిక్షణ వర్గ్ నిర్వహించుకోవడం ద్వారా నాయకుల్లో నిబద్ధత, నాయకత్వం పెరుగుతుందని అన్నారు. జాతీయపార్టీకి మండల అధ్యక్షులుగా పనిచేస్తున్నామనే సంగతి తెలుసుకోవాలని సూచించారు. సొంతంగా 16 రాష్ట్రాల్లో, మిత్ర పక్షాలతో కలసి ఐదు రాష్ట్రాల్లోనూ అధికారంలో ఉన్నామనే సంగతి మరచి పోకూడదని, కూటమి పార్టీలతో సమన్వయం చేసుకుంటూ స్థానిక అంశాల ఆధారంగా పనిచేయాలని ఆయన సూచించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి పార్టీలతో ఎలా కలసి పనిచేయాలనేదానిపై కార్యాచరణకు అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఉదయం స్థానిక గౌతమిఘాట్ వద్ద ఎమ్మెల్సీ సోము వీర్రాజు, యోగా సాధకులతో కలిసి కలసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగా మన జీవనశైలిలో ఒక భాగమని, మన పూర్వీకులు మనకు అందించిన ఒక వైద్య విధానమని పేర్కొన్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడారు. కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, బొమ్ముల దత్తు, నిర్మలా కిషోర్, లక్ష్మీ ప్రసన్న, మధుకర్, తదితరులు పాల్గొన్నారు.



ప్రశాంత నీటిజీవనం!

రంపచోడవరం దగ్గరలో భారీ నీటి ప్రాజెక్ట్ భూపతిపాలెం రిజర్వాయర్ ఉంది. ఇక్కడ ఎంతోమంది మత్స్యకారులు జీవనోపాధి పొందుతున్నారు. సువిశాల, ప్రశాంతమైన ఈ ప్రాంతంలో ఓ మత్స్యకార కుటుంబం చేపలు పడుతుండగా 'ఆంధ్రజ్యోతి కెమెరా' క్లిక్ మనిపించిందిలా.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం



కొంగలు గుంపు.. కనులకు ఇంపు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో దమ్ము చేస్తున్న పంటపొలంలో కొంగలు ఇలా గుంపుగా సందడి చేశాయి.

–మండపేట (ఆంధ్రజ్యోతి)

డొంకరాయిలో సినీ సందడి

సినీ నటుడు రవితేజపై సన్నివేశాల చిత్రీకరణ

మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చింతూరు జిల్లా వై. రామవరం మండలం డొంకరాయి గ్రామంలో గురువారం సినిమా షూటింగ్ జరిగింది. సినీ నటుడు రవితేజ హీరోగా నటిస్తున్న నూతన చిత్రానికి సంబంధించిన డొంకరాయి మార్కెట్ సెంటర్లో జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణ క్రీడామైదానంలో షూటింగ్ జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పలు సన్నివేశాలు చిత్రీకరించారు. రవితేజను చూడడానికి అధికంగా అభిమానులు తరలివచ్చారు. మైత్రీ మూవీస్ మేకర్స్ బ్యానర్పై దర్శకుడు శివ నిర్వాణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ప్రియా భవాని శంకర్ హీరోయిన్ కాగా.. సాయి కుమార్, జగపతిబాబు ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. నెలరోజుల పాటు మొదటి షెడ్యూల్ ఈ ప్రాంతాల్లో చిత్రీకరించడానికి రెండో షెడ్యూల్ను జనవరి నుంచి నిర్వహించడానికి చిత్ర బృందం ఏర్పాట్లు చేస్తుంది.



మార్కెట్ సెంటర్లో సినీనటుడు రవితేజ

అంతర్వేదిలో సినీనటుల పూజలు

అంతర్వేది, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నవనారసింహ క్షేత్రాల్లో ఒకటైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి సినీనటులు రాజీవ్కనకాల, బెల్లంకొండ ప్రవీణ్, జబర్దస్త్ అశోక్ విచ్చేశారు. వారికి ఆలయ అర్చకులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి అంతరాలయంలో దర్శనం చేసుకున్న వారికి వేద పండితులు మహాదాశీర్వచనం అందజేశారు. అనంతరం సినీ నటులతో భక్తులు సెల్ఫీలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకేటీఎస్వీ ప్రసాద్, బెల్లంకొండ సూరిబాబు పాల్గొన్నారు.



ఆలయంలో నటులు రాజీవ్కనకాల, ప్రవీణ్, అశోక్

శ్రీ పుష్పయోగం... భక్తజన తన్మయత్వం..

అన్నవరంలో ముగిసిన సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్య కల్యాణోత్సవాలు



పూజలు చేస్తున్న పండితులు..



ఊగుటూయలలో స్వామి,అమ్మవార్లు



అన్నవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడి దివ్యకల్యాణోత్సవాలు గురువారం రాత్రి జరిగిన శ్రీపుష్పయోగ మహోత్సవంతో ముగిశాయి. రాత్రి 8గంటలకు నవదంపతులైన స్వామి,అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై ఆశీనులు గావించి అర్చకస్వాములు గణపతిపూజ, పుణ్యాహవచనం నిర్వహించి స్వామి, అమ్మవార్ల అష్టోత్తర శతనామాలతో పుష్పార్చన గావించారు. అనంతరం సుగంధభరిత పుష్పాలతో అలంకరించిన ఊగుటూయలలో నవదంపతులను ఉంచి విశేష పదార్థాలను, పలురకాలైన పండ్లను ఉంచి నివేదన గావించి వధూవరులకు ఏకాంత సేవ నిర్వహించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు, కార్యక్రమానికి హాజరైన దంపతులకు దంపతీతాంబూలాలు అందజేశారు. కార్యక్రమం తిలకించేందుకు అధికసంఖ్యలో మహిళాభక్తులు విచ్చేయగా వారికి రవికవస్త్రం అందించారు. వైదిక కార్యక్రమాలను చామర్తి కన్నబాబు, పాలంకి చినపట్టాభి తదితరులు నిర్వహించగా ఆలయకమిటీ సభ్యులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు.



ఈదరాడలో స్థానికుల చేతిలో హతమైన రక్తపింజరి పాము

7 అడుగుల
రక్త పింజరి హతం

మామిడికుదురు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం ఈదరాడ గుర్రాలబీడు ప్రాంతంలో గురువారం 7 అడుగుల పొడవున్న రక్తపింజరి పామును స్థానికులు కొట్టి చంపారు. 3రోజుల వ్యవధిలో రెండు పాములను హతమార్చామని, ఇటీవల వీటి సంచారం ఎక్కువగా ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎక్కడో కొండ ప్రాంతాల్లో ఉండే ఈ పాములు సుదూర ప్రాంతాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా తరలించే కంకరతో గ్రామాల్లోకి వచ్చి పదుల సంఖ్యలో పిల్లల్ని పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని పేర్కొంటున్నారు.

రిజర్వేషన్ల శాతం మరింత పెంచాలి

బీసీ ప్రతినిధుల పిలుపు
యానాంలో ఏపీ బీసీ ఫెడరేషన్ సమావేశం



సమావేశం పాల్గొన్న బీసీ సంఘాల ప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న మల్లాడి

యానాం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచాలని, వెనుకబడిన సామాజికవర్గాలంతా ఐక్యంగా ఉంటూ హక్కుల సాధనకు సమష్టిగా కృషి చేయాలని బీసీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. యానాం కామిశెట్టివారివీధిలోని గీతా మందిరంలో ఆంధ్రపదేశ్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బీసీ సంఘనేత, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ బీసీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర బీసీ ప్రతినిధులు రిటైడ్ జస్టిస్ ఈశ్వరయ్య, బీసీ జేఏసీ ప్రతినిధి డాక్టర్ విశారదన్ మహారాజ్ (తెలంగాణ), కుడిపూడి సూర్యనారాయణ, రెడ్డి సుబ్రహ్మణ్యం, పితాని బాలకృష్ణ, ఉభయగోదావరి జిల్లాలకు ముఖ్య బీసీ నాయకులు హాజరయ్యారు. మల్లాడి మాట్లాడుతూ సుమారు 4 గంటలపాటు మేధావులు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఏవిధంగా రిజర్వేషన్లు అమలుచేస్తున్నాయనే అంశాలపై చర్చించామన్నారు. 15రోజుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరిలో ఉన్న ఇబ్బందులను ఈ 3 రాష్ట్రాల ప్రభుత్వాలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. భారత రాష్ట్రపతి, ప్రధానమంత్రి, సంబంధింత కేంద్రశాఖ మంత్రి, అధికారులతో పాటు 3 రాష్ట్రాల్లో ఉన్న ముఖ్యమంత్రులు, గవర్నర్, ఇతర మంత్రులను కలిసి రిజర్వేషన్కు సంబంధించిన అంశాలపై వివరిస్తామన్నారు. తమిళనాడు మాదిరిగానే స్థానిక ఎన్నికల్లో 69 శాతం రిజరేషన్తో పాటు విద్యాఉద్యోగాల్లో కూడా ఆంధ్రప్రదేశ్లో రిజర్వేషన్ సాధించుకోవడానికి ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని ఈశ్వరయ్య తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. విడిపోయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బీసీ, ఎస్సీఎస్టీ సోదరులంతా ఒక్కటై మనకు కావాల్సిన హక్కులన్నీ సాధించుకోవాలని మహారాజ్ అన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్లో రిజర్వేషన్ల శాతాన్ని మరింత పెంచేలా త్వరలో జరిగే రెండో సమావేశంలో సంపుర్ణ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

విద్యుత్షాక్తో పారిశుధ్య కార్మికురాలి మృతి



రమణమ్మ (ఫైల్)

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షాక్తో పారిశుధ్య కార్మికురాలు మరణించిన సంఘటన కాకినాడ జిల్లా పిఠాపురంలో గురువారం జరిగింది. పురపాలకసంఘంలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న ముత్యాల రమణమ్మ (55) విధులు ముగించుకుని ఉదయం 11గంటల సమయంలో మంగాయమ్మరావుపేటలోని తన నివాసానికి చేరుకుంది. ఇల్లు శుభ్రం చేస్తుండగా తడి కర్రకు విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో షాక్కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయింది. ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

30న ఉమ్మడి జిల్లా 'హేతువాద' మహాసభ

అమలాపురం టౌన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా హేతువాద సంఘం వార్షిక మహాసభ ఈనెల 30న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నల్లవంతెన దిగువన ఉన్న ఎస్టీయూ జిల్లాశాఖ కార్యాలయంలో జరుగుతుందని జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కేవీవీ సత్యనారాయణ, డి.రాజశేఖర్ తెలిపారు. మహాసభల్లో భాగంగా మేడూరి సత్యనారాయణ రచించిన బౌద్ధం-హేతువాద మానవవాద ఉద్యమం అనే గ్రంథాన్ని తేరాటి వసంతరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. మత విశ్వాసాలు-హేతువాదం, మూఢవిశ్వాసాలు-భావవిప్లవం తదితర అంశాలపై హేతువాద సంఘ ప్రముఖుల ఉపన్యాసాలు ఉంటాయన్నారు. అభ్యుదయ భావాలు కలిగిన వారంతా మహాసభలకు హాజరు కావాలని కేవీవీ కోరారు. వివరాలకు 9949691007లో సంప్రదించాలని కోరారు.

గట్టిగా పట్టు.. వలకట్లు పట్టు!

బలుసుతిప్పలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం పడవ పోటీలు





గోదావరిలో పడవ పోటీల్లో పాల్గొన్న మత్స్యకారులు



కాట్రేనికోన, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కాట్రేనికోన మండలం బలుసుతిప్పలో గోదావరిలో వలకట్ల అత్తరాల (స్థలాలు) కోసం గురువారం పడవ పోటీలు జరిగాయి. మత్స్యకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గోదావరికి వరదలు వచ్చినప్పటి నుంచి వరద తగ్గి ఉప్పునీరు వచ్చే వరకు వేట నిలిపివేయడం మత్స్యకారుల కట్టుబాటు. ఉప్పునీరు వచ్చిన తర్వాత బలుసుతిప్ప నుంచి కోటిపల్లి వరకు గోదావరిలో వలకట్ల కోసం సుమారు 100 ఇంజన్ బోట్లతో మత్స్యకారులు పోటీల్లో పాల్గొంటారు. ఎవరైతే పడవ పోటీల్లో గోదావరిలో వలకట్ల స్థలం దక్కించుకుంటారో వారికి మళ్లీ వరదలు వచ్చే వరకు గోదావరిలో ఆ స్థలం కేటాయింపు చేస్తారు. గోదావరిలో ఏ ప్రాంతంలో చేపలు ఎక్కువగా పడతాయో స్థానిక మత్స్యకారులకు అవగాహన ఉంటుంది. గోదావరిలో పడవలో వెళ్లి ఆ ప్రాంతాన్ని దక్కించుకుంటారు. ఏటా దీపావళి అనంతరం ఈ పోటీలు నిర్వహిస్తారు. దీంతో ప్రస్తుతం జరిగిన ఈ పడవ పోటీలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.

వృద్ధురాలిపై అత్యాచారం.. నిందితుడికి ఏడేళ్ల జైలు

కరప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): 80 ఏళ్ల వృద్ధురాలిపై అత్యాచారానికి ఒడిగట్టిన నిందితుడికి న్యాయస్థానం ఏడేళ్ల జైలు శిక్ష విధించినట్టు కరప ఎస్ఐ తోట సునీత తెలిపారు. వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామానికి చెందిన ఒక వృద్ధురాలిపై గతేడాది ఆగస్టు 29వ తేదీ రాత్రి అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ అనే వ్యక్తి అత్యాచారం చేశాడు. దీనిపై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరప పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు. సాక్షుల విచారణ అనంతరం నిందితుడిపై నేరం రుజువు కావడంతో ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరం 8వ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్య నాయుడు తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీ కనుమూరి రాధాకృష్ణరాజు ఈ కేసును వాదించారు.

జీజీహెచ్లో చికిత్స పొందుతూ ఖైదీ మృతి

జీజీహెచ్ (కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఖైదీ మెట్టు భాస్కరరెడ్డి (53) మృతిచెందాడు. 3 దశాబ్దాల క్రితం జరిగిన బాబాయి, కుమారుడు హత్య కేసుల్లో భాస్కరరెడ్డి నిందితుడిగా ఉన్నాడు. నేరం రుజువు కావడంతో గత ఐదేళ్ల నుంచి రాజమహేంద్రవరం కేంద్ర కార్యాలయంలో శిక్ష అనుభవిస్తున్నాడు. ఈ ఏడాది ఆగస్టు 31 అనారోగ్యం పాలవ్వడంతో తొలుత రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం చేయించారు. అక్కడి వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం ఎస్కార్ట్ సిబ్బందితో కాకినాడ జీజీహెచ్కు తరలించి వైద్యం అందిస్తున్నారు. అనారోగ్య పరిస్థితి విషమించడం, ఊపిరితిత్తుల సమస్యతో ఖైదీ ఆరోగ్యం విషమించి బుధవారం మధ్యాహ్నం మరణించినట్టు వైద్యులు తెలిపారు.

మధ్యప్రదేశ్కు చెందిన దొంగల గ్యాంగ్ సంచారం

అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం పోలీసులకు సమాచారమివ్వాలి
కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్కు చెందిన దొంగల బ్యాచ్ దువ్వాడ-స్టీల్ ప్లాంట్ ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు సమాచారం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని... కాకినాడ జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే తక్షణం డయల్ 100, 111 నెంబర్లకు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ ఓ ప్రకటనలో కోరారు. బుధవారం రాత్రి ఈ దొంగల బ్యాచ్ స్టీల్ప్లాంట్ ప్రాంతాల్లో తిరిగారని అనకాపల్లి మీదుగా కాకినాడ జిల్లాలోకి వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అపార్టుమెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలను లక్ష్యంగా చేసుకునే అవకాశం ఉందన్నారు. అనుమానాస్పదంగా వాహనాలు తిరిగినా, వ్యక్తులు సంచరిస్తున్నా తక్షణం సెక్యూరిటీ, పోలీసులకు సమాచారం అందించాలన్నారు. రాత్రి వేళల్లో పెట్రోలింగ్ మరింత ముమ్మరం చేయాలన్నారు. ఇళ్లను లాక్ చేసి బయటకు వెళ్లేవారు ఎల్హెచ్ఎంఎస్ని వినియోగించుకోవాలని కోరారు. రాత్రి పూట ఇంటి భద్రతా చర్యల్లో భాగంగా ప్రధాన తాళాలు, గేట్లు, గ్రిల్స్ బిగించి ఉన్నాయో లేదో చెక్ చేసుకోవాలన్నారు. ఇంటి బయట ఉన్న సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయో లేదో పర్యవేక్షించుకోవాలన్నారు. ముందస్తు భద్రత చర్యలు తీసుకుని పోలీసులకు సహకరించాలని కోరారు.

పుట్టినరోజు వేడుకలో వాగ్వాదం

కుప్పకూలి వ్యక్తి మృతి
తాటిపర్తిలో ఘటన



మరణించిన సూరిబాబు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో గురువారం రాత్రి జరిగిన వాగ్వాదంలో ఒక వ్యక్తి కుప్పకూలి మరణించాడు. గ్రామానికి చెందిన శ్రీమంతుల దయ మనుమరాలు పుట్టినరోజు వేడుక చేస్తూ రోడ్డుకు అడ్డంగా బల్లలు పెట్టారు. అదే సమయంలో వెంపల సూరిబాబు కోడలు కృష్ణవేణి అటుగా వెళ్తూ బల్లకు తగులుకోవడంతో బల్ల పడిపోయింది. దీంతో రెండు కుటుంబాల మధ్య వివాదం జరిగి వాగ్వాదానికి దారితీసింది. ఒకరిపై ఒకరు పెద్దగా కేకలు వేసుకుంటున్న సమయంలో వెంపల సూరిబాబు (59) ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. అతడిని పిఠాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మరణించినట్టు వైద్యులు తెలిపారు. గొల్లప్రోలు ఎస్ఐ ఎన్.రామకృష్ణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడలో విస్తృతంగా తనిఖీలు

కాకినాడ క్రైం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో గురువారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా కాకినాడ ఆర్టీసీ బస్ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, పార్కుల్లో పోలీసు బాంబు స్క్వాడ్ బృందం సభ్యులు రామకృష్ణ, మణికంఠ, డాగ్ హ్యాండ్లర్ శ్రీనివాస్, డాగ్ మ్యాక్స్ ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేశారు.

సంతకు వెళ్లొస్తుండగా...

ట్రాక్టర్ను ఢీకొన్న ఆటో
మహిళ మృతి
ముగ్గురికి గాయాలు
ఆటోడ్రైవర్ పరిస్థితి విషమం

చింతూరు, మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ను ఆటో ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందగా ముగ్గురికి గాయాలయ్యాయి. చింతూరు మండలం మోతుగూడెం పోలీసుస్టేషను పరిధిలోని సుకుమామిడి సమీపంలో ఈ ఘటన జరిగింది. మోతుగూడెం ఎస్ఐ సాదిత్ కథనం మేరకు.. మోతుగూడెనికి చెందిన చిరు వ్యాపారులు ప్రతీ గురువారం సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గడ్లోని కుంటలో జరిగే వారాంతపు సంతకు వెళ్లి తిరిగి సాయంత్రం ఆటోలో మోతుగూడెం చేరుకుంటారు. గురువారం సంత ముగించుకుని తిరిగి మోతుగూడెం వస్తుండగా సుకుమామిడి సమీపంలో ఓ ట్రాక్టర్ను వెనుకవైపు నుంచి ఆటో ఢీకొంది. ఆటోలో ముగ్గురు ప్రయాణికులు, డ్రైవర్ రాము తీవ్రంగా గాయపడ్డారు. చింతూరు ఆసుపత్రికి తరలించగా వారిలో వేగి మంగ (50) మృతిచెందింది. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో భద్రాచలం తరలించారని ఎస్ఐ తెలిపారు.



మరణించిన మంగ

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

నేటి నుంచి మెగా దంత వైద్య శిబిరం

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీ4లో భాగంగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కలెక్టర్ షాన్‌మోహన్ సూచనతో జీఎస్ఎల్ ఆసుపత్రులు, నియో విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, డైరెక్టర్ డాక్టర్ బుర్రా దివ్యరాజ్ ఆధ్వర్యంలో పిఠాపురంలోని రెడ్డి రాజా కల్యాణ మండపంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో మెగా దంత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రూ.2కోట్లు విలువైన చికిత్సలను ఉచితంగా అందజేస్తామని దివ్యరాజ్ వివరించారు.

రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ



చిరు వ్యాపారితో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కమిషనరు సత్యనారాయణ

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగర ప్రజలు, వ్యాపారులు తడి, పొడి చెత్తలను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలి.. రోడ్లపై చెత్త వేస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనరు ఎన్వీవీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం ఆయన డైరీఫామ్ సెంటర్లో పారిశుధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. టిఫిన్ సెంటర్లు, టీస్టాల్స్ వద్ద చెత్త పడేయడం గమనించారు. షాపుల వద్ద డస్ట్‌బిన్లు ఏర్పాటుచేయడం తప్పనిసరి అని, వినియోగదారులు రోడ్లపై చెత్త వేయకుండా చూసుకోవాలని యజమానులకు సూచించారు. రాజీవ్ గృహకల్ప సముదాయంలో తాగునీటి నిల్వలను పరిశీలించి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంజయ్‌నగర్ ప్రాంతంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించగా అక్కడి పరిస్థితులను హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వీచరణ్ వివరించారు. డైరీఫారం సెంటర్లో అన్నక్యాంటీన్‌ను తనిఖీ చేసి ఆహార నాణ్యతపై అక్కడున్న వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

గొల్లప్రోలు రూరల్/పిఠాపురం రూరల్/కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ వెల్లడించారు. గురువారం సాయంత్రం ఆయన పిఠాపురం నియోజకవర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి-చెందుర్తి మధ్య రూ.1.80కోట్లతో బీటీ రోడ్డు, ఉప్పాడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి మల్లాం వరకు రూ.1.40కోట్లతో బీటీ రోడ్డు, కందరాడ ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రాజీవ్ కాలనీ వరకు రూ.55లక్షలతో బీటీ రోడ్డు, పిఠాపురం మండలం వెల్దుర్తి-ధర్మవరం ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి రాయవరం వరకు రూ.2కోట్లతో రోడ్డు, నాబార్డు నిధులు రూ.1.20 కోట్లతో నాగులాపల్లి ఎస్సీ కాలనీ నుంచి చేబ్రోలు వరకు బీటీ రోడ్డు



గొల్లప్రోలు మండలం తాటిపర్తి-చెందుర్తి మధ్య రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీ

నిర్మాణాలకు ఆయన శంకుస్థాపన చేశారు. జనసేన ఫైవ్‌మెన్ కమిటీ సభ్యుడు ఓదూరి కిషోర్, నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, టి.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

'రేరా' నిబంధనలు కచ్చితంగా పాటించాలి

కాకినాడ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రియల్ ఎస్టేట్ డవలపర్స్ 'రేరా' నిబంధనలను కచ్చితంగా పాటించాలని ఏపీ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ ఏఆర్ఈ శివారెడ్డి పేర్కొన్నారు. క్రెడాయ్ కాకినాడ చాప్టర్ అధ్యక్షుడు విజయకృష్ణ అధ్యక్షతన 6వ జనరల్ బాడీ సమావేశం నగరంలోని ఓ కన్వెన్షన్ సెంటర్లో గురువారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ రియల్ ఎస్టేట్ డవలపర్స్ నుంచి భవనాలు కొనుగోలు చేస్తున్న యజమానుల హక్కుల పరిరక్షణకు 'రేరా' పని చేస్తుందన్నారు. జనవరి నుంచి ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నిర్మాణ రంగంలో అనుమతులు మంజూరు చేస్తామన్నారు. అనంతరం శివారెడ్డిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. కాకినాడ చాప్టర్ ప్రధాన కార్యదర్శి రమణారావు, చైర్మన్ నెక్కంటి శ్రీనివాస్, కోశాధికారి పురం రాంబాబు, ఉపాధ్యక్షుడు జీవీఎస్డీ రాయుడు, జాతీయ లా సభ్యుడు వీఎస్ ప్రసన్న, రాజమహేంద్రవరం చాప్టర్ చైర్మన్ సురవరపు శ్రీనివాస్, అధ్యక్షుడు మన్యం ఫణికుమార్, ప్రతినిధులు శేఖర్‌రెడ్డి, సీతారామరెడ్డి, అశోక్, డి.సాయి, దేవత శేఖర్, బలరాం, చంద్రశేఖర్, చక్రధర్, ఉదయభాను తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ శివారెడ్డి

'మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి'

కరప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని, సంఘ సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీఏ పీడీ జి.శ్రీనివాసరావు కోరారు. గురువారం ఆయన సిబ్బందితో కలిసి కరప, వేళంగి, నడకుదురు, కూరాడ తదితర గ్రామాల్లో పర్యటించారు. గ్రామ సంఘాల పనితీరును సమీక్షించి సిబ్బందికి సూచనలు చేశారు. స్త్రీనిధి రుణాల లబ్ధిదారులతో ముఖాముఖి నిర్వహించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. వేళంగి యూనియన్ బ్యాంకును సందర్శించి రుణాల మంజూరు, చెల్లింపులపై బ్యాంకు అధికారులతో చర్చించారు. స్థానికంగా నిర్వహిస్తున్న మట్టి పాత్రల యూనిట్‌ను సందర్శించి స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడారు. ఏపీడీ జిలానీ, డీపీఎంలు, కరప ఏపీఎం ఎస్.సత్యవతి, సిబ్బంది పాల్గొన్నారు.



వేళంగిలో మట్టి పాత్రల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న డీఆర్డీఏ పీడీ శ్రీనివాసరావు

బాల్య వివాహాల నిరోధం కోరుతూ ర్యాలీ

సామర్లకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాధవపట్నంలో క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సుమారు 200 మంది పాల్గొని బాల్య వివాహాలు వద్దంటూ నినాదాలు చేశారు. అనంతరం బాల్య వివాహ ముక్త భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సీడీపీవో జి.ఉష, సర్పంచ్ మేడిశెట్టి సుగుణమ్మ, ఎంపీటీసీ గుత్తుల కృష్ణార్జునరావు, చైల్డ్ రైట్స్ ప్రాజెక్టు జిల్లా కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు సీఎస్ వర్కర్ బి.లక్ష్మి, సూపర్‌వైజర్ నళిని, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఐసీడీఎస్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ట్రస్టు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సంయుక్తంగా కాకినాడ జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ కార్యాలయం దగ్గర గురువారం బాల్య వివాహ ముక్త భారత్ నిర్వహించారు. నోడల్ ఆఫీసర్ జెస్సీ ఫ్లోరెన్స్, చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్ బి.కుమారి మాట్లాడుతూ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా వంద రోజులు అవగాహన కార్యక్రమాలను క్రాఫ్ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తుందన్నారు. బాల్య వివాహాల సమాచారం తెలిసిన వెంటనే 1098 నెంబరుకు సమాచారం ఇవ్వాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్లు, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 కేస్ వర్కర్ ఎన్.లక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

'డిమాండ్ ఆధారంగా పంటల సాగు మేలు'

పిఠాపురం రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలను, విత్తన రకాలను సాగు చేస్తే అధిక లాభాలు వస్తాయని వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ విజయకుమార్ తెలిపారు. మండలంలోని ఎఫ్‌కే పాలెంలో గురువారం జరిగిన రైతన్నా మీ కోసంలో ఆయన పాల్గొని రైతులకు పలు సూచనలు ఇచ్చారు. పంచసూత్రాలు పాటించి వ్యవసాయంలో ముందుకు వెళ్లాలని సూచించారు. ఖరీఫ్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకోవాలన్నారు. ధాన్యం అమ్మిన 24గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో సొమ్ములను ప్రభుత్వం జమ చేస్తోందని తెలిపారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు పి.స్వాతి, మండల వ్యవసాయాధికారి గంగాధర్, సర్పంచ్ మహాలక్ష్మి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహ సముదాయంలో 'పీఎం ఆవాస్ యోజన'

కాకినాడ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పర్లోవపేట టిడ్కో గృహ సముదాయంలో గురువారం సాయంత్రం ప్రధానమంత్రి ఆవాస్ యోజన-2025 అంగీకార కార్యక్రమం నిర్వహించారు. మహిళలకు ముగ్గుల పోటీలు, పిల్లలకు ఆటల పోటీలు జరిపారు. ముఖ్య అతిథిగా హాజరైన కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు విజేతలకు బహుమతులు అందజేశారు. గృహ సముదాయం ఆవరణలో మొక్కలు నాటారు. కాకినాడ కార్పొరేషన్, గృహ నిర్మాణ సంస్థ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మొబైల్‌కు దూరంగా ఉండాలి'

కాకినాడ రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులంతా మొబైల్‌కు దూరంగా ఉంటూ స్క్రీన్ సమయాన్ని బాగా తగ్గించుకోవాలని కాకినాడ రూరల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ సూచించారు. మౌంట్ కార్మెల్ పాఠశాల కరస్పాండెంట్ ఎన్.సాయారాం అధ్యక్షతన విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏ విధంగా ప్రవర్తించాలి, మొబైల్ వినియోగంలో అప్రమత్తత, సైబర్ నేరాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌లపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి, సీఐ చైతన్యకృష్ణ, అతిథి, ఎస్ఐ ఎం.వీరబాబు విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ తరగతిలో గానీ, పాఠశాలల్లో గానీ బాలికలకు ఏమైనా సమస్యలుంటే హెచ్ఎంకు తెలపాలన్నారు. ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇలా... ఎండి పోవాల్సిందేనా!



పచ్చదనం పెంపొందించేందుకు సామర్లకోట-పెద్దాపురం ప్రధాన రహదారిలో విఘ్నేశ్వర థియేటర్ సెంటరు నుంచి బడేలమ్మ చెరువు సెంటరు వరకు సెంట్రల్ డివైడర్‌లో అనేక మొక్కలు నాటారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో రెండు రోజులకోసారి ఈ మొక్కలకు ట్యాంకర్లతో నీరు పెట్టేవారు. గత పది రోజులుగా నీరు పెట్టకపోవడంతో అవి ఎండిపోతున్నాయని పలువురు పర్యావరణ అభిమానులు వాపోతున్నారు. ఈ మేరకు వారు ఎమ్మెల్యే చినరాజప్పకు మౌఖికంగా ఫిర్యాదు చేశారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి)

వాడివేడిగా పెద్దాపురం కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా పట్టణంలో పలు అభివృద్ధి పనులు ముందుకు సాగట్లేదని పలువురు వైసీపీ కౌన్సిలర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. పెద్దాపురం కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని చైర్‌పర్సన్ బొడ్డు తులసిమంగతాయారు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చినరాజప్ప ఎప్పుడూ రాలేదని, ఆయన మంచితనమే ఆయన్ని మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించిందంటూ పలువురు కౌన్సిలర్లు ఆయనపై ప్రశంసల జల్లు కురిపించారు. కౌన్సిలర్ ఆరెళ్ల వీరరాఘవులు మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల తీరుతోనే అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్ఆర్ఎస్, బీఆర్ఎస్ ద్వారా వచ్చిన ఆదాయంపై ప్రశ్నించారు. కమిషనరు నుంచి సంతృప్తికరమైన సమాధానం రాకపోవడంతో ఈ విషయమై తనకు పూర్తిస్థాయిలో స్పష్టత కావాలని చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. కమిషనరు తీరు సరిగ్గా లేదని, ఆయన నిధులకు సంబంధించి సమాధానం కావాలని డిమాండ్ చేశారు. తమ వార్డులో తాగునీటి సమస్యలను పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకొచ్చినా చర్యలు తీసుకోలేదని కౌన్సిలర్ గోకాడ అప్పారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనరు నుంచి సమాధానం లేకపోవడంతో ఆయన కూడా చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించారు. కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ఇంటి పన్నులపై స్పష్టత ఇవ్వాలని నిలదీశారు. అనంతరం పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కమిషనరు శ్రీకాంత్‌రెడ్డి, మేనేజరు జ్యోతిరాణి, టీపీవో ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, డీఈ ప్రకాశరావు, ఆర్వో అచ్యుతరాజు తదితరులు పాల్గొన్నారు.



చైర్‌పర్సన్ పోడియం ముందు బైఠాయించిన వైసీపీ కౌన్సిలర్ వీరరాఘవరావు

నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలి

కాకినాడ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మోదీ ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడాలని, కార్మికుల హక్కులను కాలరాసే నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాల ఆధ్వర్యంలో గురువారం కాకినాడ మెయిన్‌రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం బాలాజీచెరువు వరకు ర్యాలీ నిర్వహించారు. తొలుత పోస్టాఫీసు వద్ద ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి కె.బోడకొండ, ఏపీఎంఎస్ఆర్‌యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చివకుల వెంకటరావు రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ధర్నానుద్దేశించి ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.అప్పారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లూరి రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జె.వెంకటేశ్వర్లు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు తాళ్లూరి రాజు, బ్యాంకు ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు అమలు చేయాలని, స్కీం వర్కర్లను, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి చెక్కల రాజ్‌కుమార్, వర్కింగ్ కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు, కోశాధికారి మలకా రమణ, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమళ్ల పద్మ పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సంబంధిత జీవోలను వలసపాకల సెంటర్లో దహనం చేశారు. కార్మికుల హక్కుల పాలిట ఉరితాడుగా మారిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దువ్వా శేషబాబ్జీ, రూరల్ కార్యదర్శి తొట్టిపూడి రాజా కోరారు. ఏపీ కృష్ణాజీ, వాసంశెట్టి చంద్రరావు, బలరాం, సంగీతరావు, రాంబాబు, శ్రీను, నూకరాజు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మెయిన్‌రోడ్డులో ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు




ప్రారంభిస్తున్న పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా, అదనపు జిల్లా జడ్జి శ్రీహరి

కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంటు ప్రారంభం

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో ఉమర్‌ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కూలింగ్ మినరల్ వాటర్ ప్లాంటును విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్‌ఆలీషా ఉమర్ ఆలీషా, అదనపు జిల్లా జడ్జి ఎం.శ్రీహరి గురువారం ప్రారంభించారు. కోర్టుల ఆవరణలో 36 మొక్కలు నాటారు. మంతెన సుబ్బరాజు జ్ఞాపకార్థం వాటర్ ప్లాంటు సమకూర్చిన ఆయన కుమార్తె సూర్యావతిని సత్కరించారు. పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రాజారావు, మున్సిపల్ కమిషనరు పి.రాజు, పీఠం కన్వీనర్ పేరూరి సూరిబాబు, రేకా ప్రకాష్, పురపాలక సంఘ టీడీపీ ఫ్లోర్ లీడర్ అల్లవరపు నగేష్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ధనరాజు



సర్పవరం జంక్షన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురానికి చెందిన సీనియర్ నాయకుడు కాళ్ల ధనరాజుని బీజేపీ కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమారస్వామి ఉత్తర్వులు జారీ చేశారు. రైతుల సంక్షేమం, అభివృద్ధి కోసం కేంద్రం అమలు చేస్తున్న పథకాలను క్షేత్రస్థాయిలోకి తీసుకెళ్లి కిసాన్‌మోర్చాని గ్రామీణ స్థాయిలో మరింత బలోపేతం చేస్తానని ధనరాజు చెప్పారు.

రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెద్దిరాజు

కొత్తపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండల రేషన్ డీలర్ల సంక్షేమ సంఘ అధ్యక్షుడిగా కడియాల పెద్దిరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎస్. సత్యనారాయణ, కోశాధికారిగా గంట్రోతు కిషోర్, ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. వారంతా తహసీల్దారు జి.చిన్నారావును మర్యాదపూర్వకంగా కలవగా అభినందించారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం ప్రారంభం

సామర్లకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శంకర నేత్రాలయ, ఎర్నేని నటరాజ నాట్యాంజలి సంయుక్త ఆధ్వర్యంలో కుమారరామ భీమేశ్వరాలయంలో ఏర్పాటుచేసిన ఉచిత కంటి పొర శస్త్ర చికిత్స శిబిరాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప మాట్లాడుతూ ఏడు రోజులు నిర్వహించే శిబిరానికి హాజరయ్యే వారికి భీమేశ్వరాలయ నిత్యాన్నదాన పథకంలో భోజనాలు పెడతామన్నారు. వైద్య పరీక్షలు, ఓపీ నమోదు విభాగాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిర నిర్వాహకులు గడ్డమనుగు శివ, కందూరి శ్యామ్, మీసాల సునీత, భీమేశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్ (బాబు), ఈవో బళ్ల నీలకంఠం, వెంకటరమణ, సభ్యులు పాల్గొన్నారు. చెన్నై శంకర నేత్రాలయ నుంచి వచ్చిన 25 మంది నిపుణులు 150 మందిని పరీక్షించారు. హాజరైన 400 మందికి భోజనాలు పెట్టారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్యే చినరాజప్ప

'వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటు చేయాలి'

పిఠాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న 12వ వేతన సంఘాన్ని తక్షణం ఏర్పాటుచేసి 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు డి.శ్రీను డిమాండ్ చేశారు. మండలంలోని ఎఫ్‌కే పాలెం, చిత్రాడ తదితర గ్రామాల్లోని మండలపరిషత్ పాఠశాలల్లో కాకినాడ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సభ్యత్వ నమోదులో ఆయన పాల్గొని మాట్లాడారు. సంపాదిత సెలవులకు నగదుతో పాటు విశ్రాంత ఉద్యోగులు, ఉపాధ్యాయుల బకాయిలను తక్షణం చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారానికి తమ సంఘం నిరంతరం పోరాటం చేయడంతో పాటు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. సంఘం కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎన్.సాయికృష్ణ, శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు డి.మణికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డెమోక్రటిక్ పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీను

కాకినాడ రూరల్‌లో కాంగ్రెస్ సంస్థాగత నిర్మాణంపై సమావేశం

కాకినాడ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంఎం పళ్లంరాజు ఆదేశాల మేరకు డీసీసీ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ ఇన్‌చార్జి పిల్లి సత్యలక్ష్మీచిన్న నేతృత్వంలో గురువారం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో రూరల్ నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఐసీసీ పరిశీలకుడు ఆలీమేధీ పార్టీ సంస్థాగత నిర్మాణంపై మాట్లాడారు. కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మేడిశెట్టి నారాయణ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ మొయ్యేటి సూర్యప్రకాష్, పీసీసీ సభ్యుడు పోలిశెట్టి శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల గాంధీరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు పబ్బినీడి కృష్ణ, రూరల్ మండల శాఖ అధ్యక్షుడు తాండ్రంగి రమణమూర్తి, బీసీ సెల్ రూరల్ చైర్మన్ పెద్దింశెట్టి వీరబాబు, మాసవరపు వెంకటరమణ పాల్గొన్నారు.

ఈజీ హోమ్ లోన్‌పై అవగాహన

సామర్లకోట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మెప్మా కార్యాలయంలో సీఎంఎం సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో గురువారం టిడ్కో లబ్ధిదారులకు ఈజీ హోమ్‌లోన్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కమిషనరు శ్రీవిద్య మాట్లాడుతూ ఇప్పటివరకు వరకూ పట్టణంలో 350 మంది వివిధ కారణాలతో రిజిస్ట్రేషన్, రుణ మంజూరు ప్రక్రియలు పూర్తి చేసుకోలేకపోయారన్నారు. అటువంటి వారిని ప్రభుత్వం గుర్తించి ఈజీ రుణాలు ఏర్పాటు చేసిందన్నారు. నిర్దేశించిన వాయిదాలను నెలవారీ చెల్లించాల్సి ఉంటుందన్నారు. సేల్స్ మేనేజరు గాంధీ, టిడ్కో సీఎల్‌టీ సి.రత్న, బి.వెంకటలక్ష్మి, వై.వెంకటలక్ష్మి, అరుణ తదితరులు పాల్గొన్నారు.



వెండి పూత ద్వారం ప్రారంభం

కాకినాడ సిటీ, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద కొలువుదీరిన షిరిడీ సాయిబాబా ఆలయ ద్వారాన్ని భక్తుల సహకారంతో వెండి పూతతో తయారు చేయించారు. గురువారం దీనిని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పెనుపోతు సూర్యారావు, డాక్టర్ రామ్మూర్తి, చొక్కా గిరి, పినపోతు తాతారావు, లంకే గంగాధరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సర్పవరం జంక్షన్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): వార్షిక మరమ్మతుల కోసం 33/11 కేవీ సర్పవరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ ఏపీఎస్పీ ఫీడర్‌లో పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ (ఆపరేషన్స్) ఎన్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో కోరారు. ఈశ్వర్‌నగర్, బాలాజీనగర్, ఆంజనేయనగర్, ఏపీఎస్పీ ఏరియా, రాయుడుపాలెం, శేషాద్రినగర్, రాజీవ్‌నగర్ -1, 2, ఎస్ఆర్ఎంటీ కాలనీ, కొత్తూరు, సిద్ధార్థనగర్, టీచర్స్ కాలనీల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తామని చెప్పారు.

కాకినాడ రూరల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంద్రపాలెం సెక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ వార్షిక మరమ్మతుల నిమిత్తం శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. రేపూరు, గంగనాపల్లి, కొవ్వాడ, చీడిగ, ఇంద్రపాలెం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని చెప్పారు.



కమల వైష్ణవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో 'శ్రీప్రకాష్' విద్యార్థిని ప్రతిభ

పెద్దాపురం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు మదనపల్లిలో ఇటీవల జరిగిన 69వ ఎస్‌జీఎఫ్ఐ అంతర్ జిల్లాల అండర్-14 బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బాలి, బాలికల జట్లు ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఇందులో శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాల 8వ తరగతి విద్యార్థిని దాడి కమలవైష్ణవి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిరజత పతకం సాధించిందని డైరెక్టర్ సీహెచ్ విజయప్రకాష్ తెలిపారు. విద్యార్థినితో పాటు ఆమెకు శిక్షణ ఇచ్చిన కోచ్‌ను ఆయనతో పాటు సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, అకడమిక్ కో-ఆర్డినేటర్ ప్రశాంతి, కల్చరల్ కో-ఆర్డినేటర్ ఉషాచైతన్య, ఉపాధ్యాయులు అభినందించారు.

ఫుడ్‌సేఫ్టీ అధికారుల తనిఖీలు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కేవీ సుబ్బారావు, నగరపాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ సతప్పనాయుడు గురువారం ఆర్టీసీ రైతు బజారులో తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు బఠానీ, చిలకడ దుంపలకి రంగులు వేస్తున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు శాంపిల్స్ సేకరించారు.

విజేతలకు బహుమతులు అందజేత

కరప, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరప హైస్కూల్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. విజేతలకు మెడల్స్, మెమెంటోలు అందజేశారు. బహుమతులు స్పాన్సర్ చేసిన పాఠశాల పూర్వ విద్యార్థి భోగిరెడ్డి కొండబాబుకు ఎస్ఎఫ్ఐ కరప మండల కార్యదర్శి ఎ.సంజయ్ కృతజ్ఞతలు తెలిపారు. హెచ్ఎం రాజరాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

గండేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): సింగరంపాలెం, రామయ్యపాలెం గ్రామాలకు ఈనెల 29,30న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎలక్ట్రికల్ ఈఈ బి.వీరభద్రరావు, ఏఈ కిరణ్‌కిషోర్ తెలిపారు. సింగరంపాలెం నూతన సబ్‌స్టేషన్ పనుల్లో భాగంగా అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పోలవరం జిల్లాతో తొలగిన ముంపువాసుల కష్టాలు

● చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఎటపాక, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా పోలవరం ప్రత్యేక జిల్లాతో ముంపు మండలాల వాసుల కష్టాలు తొలగనున్నాయని, గతంలో ముంపువాసులకు ఇచ్చిన మాటను సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ మండలాధ్యక్షుడు బొల్లా పుల్లయ్య, తెలుగు యు వత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, అరకు పార్లమెంట్ కార్యదర్శి ముప్వా శ్రీనివాస్ తెలిపారు. కూటమి ప్రభుత్వం పోలవరం కొత్తజిల్లా ప్రకటించిన నేపథ్యంలో గురువారం తోటపల్లి గ్రామంలో సీఎం చంద్రబాబు చిత్రపటానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం నిర్వహించారు. ఇక ముంపు ప్రజల దూరప్రయాణ వెతలు తీరనున్నాయని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ దొంతు మంగేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు మాచినేని రాజేష్, టీడీపీ నాయకులు బాచినేని మల్లేశ్వరరావు, రావి మాధవరావు, గుత్తా వెంకన్న, గొమ్ము కొత్తగూడెం ఎంపీటీసీ పాయం దేవీ, సంద్ర రఘు, జనసేన మండలాధ్యక్షుడు ఎం.గంగాధర్, సతీష్ పాల్గొన్నారు.

దేవీపట్నంలో...



చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

దేవీపట్నం/గోకవరం, నవంబరు27 (ఆంధ్రజ్యోతి): గోకవరం శివారు గంగాలమ్మతల్లి ఆలయ సమీపంలో దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో తెలుగుదేశంపార్టీ మండల యూత్ అధ్యక్షుడు లంక హరిచంద్రుడు, గ్రామ కమిటీ అధ్యక్షుడు గేదెల పెద్దసుబ్బారావు ఆధ్వర్యంలో గురువారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. గత ఐదు సంవత్సరాల నుంచి అసంపూర్తిగా మిగిలిపోయిన దేవీపట్నం ఆర్అండ్ ఆర్ కాలనీ పనుల సమస్యను దేవీపట్నం నిర్వాసితులు లంక హరిచంద్రుడు, తొట్టా బాలాజీ ప్రసాద్ తదితరులు మంత్రి నారా లోకేష్‌కు ప్రజాదర్బారులో విన్నవించారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందించి పనులు మొదలు పెట్టాలని అధికారులను ఆదేశించగా అధికారులు గురువారం పనులు మొదలు పెట్టారు. దీంతో నిర్వాసితులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిద్దా రామకృష్ణ, దొడ్డా పోసిబాబు, ఉప్పాల సుబ్రహ్మణ్యం, పాల రమణారెడ్డి, లింగంపల్లి హరిబాబు, సిద్దా ప్రసాద్, కందమ్మ పాల్గొన్నారు.

తొమ్మిదెకరాల సమస్యను పరిష్కరించండి

దేవీపట్నం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో సుమారు 120 మంది నిర్వాసితులకు ఇచ్చిన తొమ్మిదెకరాల స్థలంలో భూ యజమాని సాగు చేసుకుంటుడడంతో ఈభూమి నిర్వాసితులకు దక్కలేదు. ప్రస్తుత ం ఈ విషయం కోర్టులో ఉంది. ఈ సమస్య త్వరితగతిన పరిష్కరించాలని నిర్వాసితులు కోరుతున్నారు.

ఖాళీ బిందెలతో మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

ఎటపాక, నవంబరు27(ఆంధ్ర జ్యోతి): లక్ష్మీపురంలో ఇటీవల మంచి నీటిఎద్దడితో తీవ్రఅవస్థలు పడు తున్నామని, సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువార ం సీపీఎం ఆధ్వర్యంలో గ్రామ సచివాలయం ఎదుట మహిళలు ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమం చేపట్టారు. జాతీయ రహదారి విస్తరణ పనుల్లో గ్రామ పంచాయతీ ద్వారా సరఫరా అయ్యే మంచినీటి పైపులైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. చేతిపంపులపైన ఆధారపడుతున్నామని తెలిపారు. గ్రామంలో వీధిలైట్లు వెలగడ లేదని, అంతర్గత రహదారులు మంజూరు చేయాలని కోరారు. సీపీఎం మండల కార్యదర్శి కాకా అర్జున్, మాజీ సర్పంచ్ రత్తమ్మ, ఐవీ, పులుసు బాలకృష్ణ, పూనేం వెంకట్రావు, సవలం రాము, పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలుచేయాలి



విద్యార్థినిలతో భోజనం చేస్తున్న పీవో స్మరణ్‌రాజ్

రంపచోడవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ప్రతిరోజు మెనూ సక్రమంగా అమలు చేయాలని ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇర్లపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు తాజాగా ఉండే ఆహార పదార్థాలు, కాచి చల్లార్చిన నీటిని అందించాలన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, డీఈ చైతన్య, హెచ్ఎం రాజేశ్వరి పా ల్గొన్నారు.

'అంబేడ్కర్‌కు నివాళులర్పించాలి'

రంపచోడవరం, నవంబర్ 27 (ఆంధ్రజ్యోతి): డిసెంబర్ 6న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని నిర్వహించాలని సీనియర్ దళిత నాయకుడు మాదె రామచంద్రరావు గురువారం ప్రకటనలో కోరారు. అంబేడ్కర్ సేవలను స్మరించుకుంటూ గ్రామస్థాయి నుంచి అంబేడ్కర్ విగ్రహాలకు నివాళులర్పించాలన్నారు.

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ యువకుడి మృతి

రాజవొమ్మంగి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): గత ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడ లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాజవొమ్మంగి గ్రామానికి చెందిన మహ్మద్ అబ్దుల్ కరీం(19) అనే యువకుడు గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఆదివారం అబ్దుల్ ద్విచక్రవాహనంపై వెళుతూ రాజవొమ్మంగి గ్రామ శివారులో టాటా ఏస్ వాహనాన్ని ఢీ కొనడం తో అబ్దుల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీం తో కుటుంబీకులు కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెం దాడు. రాజవొమ్మంగి గ్రామంలో కిరాణా వ్యాపారి దావుద్ కుమారుడు అబ్దుల్ మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. గ్రామవ్యా ప్తంగా అన్ని దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కొండపల్లి ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ కుంజం సూరిబాబు కుటుంబానికి ఉపాధిహామీ అధికారు లు ఆర్థికసాయం అందించారు. ఉపాధిహామీ ఏపీవో శ్రీనివాస్, సిబ్బంది సహకారంతో రూ.18000 ఆర్థికసాయాన్ని ఎంపీడీవో యాదగిరేశ్వరావు సూరిబాబు కుటుంబానికి గురువారం అందించారు.

మాజీ ఎంపీపీ గొర్లె శ్రీకాంత్‌కు మాతృ వియోగం



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి, బాబురమేష్

వై.రామవరం, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండల మాజీ ఎంపీపీ, తెలుగు దేశం పార్టీ ముఖ్యనాయకుడు గొర్లె శ్రీకాంత్ తల్లి గొర్లె లీలావతి(75) అనారోగ్యంతో మృతిచెందారు. బుధవారం రంపచోడవరం నుంచి తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యేలు సీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబురమేష్, తెలుగు యువత అధ్యక్షుడు విజయభాస్కర్ తదితరులు వై.రామవరంలో ఉన్న శ్రీకాంత్ నివాసానికి చేరుకుని సంతాపం తెలిపారు. లీలావతి పార్థీవదేహానికి నివాళులర్పించారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రయాణం.. నరకం!

ధ్వంసమైన రమణయ్యపేట- జె.అన్నవరం రహదారి

ఆర్టీసీ బస్సులు, వాహనాలు వెళ్లేందుకు వీలు లేని రీతిలో పెద్ద పెద్ద గుంతలు

హడలెత్తిపోతున్న ప్రయాణికులు



రమణయ్యపేట వద్ద గోతులమయమైన రహదారి



తూర్పులక్ష్మీపురంలో రోడ్డు దుస్థితి

ఏలేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏలేశ్వరం మండలం రమణయ్యపేట- జె.అన్నవరం రహదారిపై ప్రయాణించాలంటేనే ప్రజలు హడలెత్తిపోతున్నారు. రహదారి నిర్మాణ పనుల్లో గత వైసీపీ ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యం ప్రస్తుతం వాహనదారులు, ప్రయాణికులకు శాపంగా మారింది. జె.అన్నవరం రోడ్డు సుమారు 14 కిలోమీటర్ల మేర గోతులమయం కావడం వల్ల ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు పనులకు ఎన్‌డీబీ నిధులు రూ.12 కోట్లు విడుదలయ్యాయి. సుమారు నాలుగేళ్ల క్రితం కాంట్రాక్టర్ రోడ్డుకి ఇరువైపులా అంచులు తవ్వేసి వదిలేశారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవ డంతో కాంట్రాక్టర్ మళ్లీ రోడ్డు వైపు చూడకపోవడంతో పూర్తిగా ధ్వంసమైంది. నిధులు ఉన్న పనులు చేయిం చడంతో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో ఏలేశ్వరం, తూర్పు లక్ష్మీపురం, రమణయ్యపేట, రాయవరం, జె.అన్న వరం, రాయవరం గ్రామ ప్రజలు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని వెళ్లాల్సి వచ్చింది. ఆర్టీసీ బస్సులు, వాహనాలు, ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు వీలు లేని రీతిలో పెద్ద పెద్ద గుంతలతో రోడ్డు మారిపోయింది. ముఖ్యంగా రమణయ్యపేట- జె.అన్నవరం రోడ్డు అధ్వానంగా ఉండడంతో సుమారు 6 గ్రామాలు 14 కిలో మీటర్లు మేర ద్విచక్రవాహనదారులు, బాటసారులు నానా అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపనులు వేగవంతం చేయాలని ప్రయాణికులతో పాటు ప్రజలు కోరుతున్నారు.

పోలింగ్ బూత్‌స్థాయి అధికారులకు అవగాహన

గండేపల్లి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండల గ్రామాల్లో ఓటరు లిస్టుల్లో కుటుంబ సభ్యులతో మ్యాపింగ్ చేసే విధానంపై యాప్ ద్వారా ఎలా చేయాలనే దానిపై గురువారం తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ పోలింగ్ బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతీ గ్రామంలో ఈ యాప్ ద్వారా కుటుంబంలో ఎంతమంది ఉన్నారో మ్యాపింగ్ తప్పనిసరిగా చేయాలని ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహశీల్దార్ దివ్యభారతి తదితరులు ఉన్నారు.



తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కల్పిస్తున్న తహశీల్దార్



జగ్గంపేటలో మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నేడు, రేపు పీడీఎస్‌యూ మహాసభలు

జగ్గంపేట, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను పెద్దాపురం, జగ్గంపేట డివిజన్ కమిటీ సభ్యులు జగ్గంపేటలో ఐటీఐ కాలేజీ నందు పోస్టర్లను ఆవిష్కరించారు. 24వ రాష్ట్ర మహా సభలు రాజమండ్రిలో ఈనెల 28,29 తేదీల్లో జరుగుతున్నాయని మొదటిరోజు బహిరంగ సభ, 2వ రోజు ప్రతినిధులు సభ అని తెలిపారు. ఈ సభలకు ఆంధ్రప్రదేశ్ కార్య దర్శి ఎస్.కిరణ్ కుమార్, అధ్యక్షుడు రఫీ హాజరవుతారని.. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి విద్యార్థులు వస్తారని పేర్కొన్నారు. విద్యార్థి హక్కుల సాధనకు, శాస్త్రీయ విద్యావ్యవస్థ పరిరక్షణకు, సమాన విద్య కోసం ప్రతి విద్యార్థి కదం తొక్కాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ నాయకుడు రామిరెడ్డి, డివిజన్ కార్యదర్శి వి.కుమార్, ఉన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

తొండంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొండపూడి వైజంక్షన్‌వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. ఆర్.మంగ భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వస్తుండగా బెండపూడి శివారు వైజంక్షన్ సమీపంలో వెనుక నుంచి లారీ ఢీకొనడంతో మంగ తీవ్రంగా గాయపడింది. ఆమెను కాకినాడ జీజీహెచ్ అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం విశాఖపట్నం తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రైతు ఆనందంతోనే రాష్ట్రం సుభిక్షం

తుని ఎమ్మెల్యే యనమల దివ్య



తుని మండలం రాపాక గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య

తుని రూరల్, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): రైతు ఆనందంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా తుని మండలం రాపాక గ్రామంలో పర్యటించి రైతులతో మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసి రైతును రాజులా చూసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు అనేకమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు రూపకల్పన చేస్తూ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పాడి రైతును ప్రోత్సహించేందుకు మినీగోకులాలు నిర్మించి రాయితీపై పశువుల కొనుగోలుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద జమ అయిన నిధులపై రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల నుంచి ఏ సమస్యలు ఉంటే త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి అబ్బాయి, టీడీపీ సీనియర్ నాయకుడు యనమల రాజేష్, కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని రైతులను ఉద్దేశించి మాట్లాడారు. టీడీపీ నాయకులు మంతెన గంగాధర్, గంధం బాబ్జి, గంతగోరు రమణ, మెట్ల సత్యనారాయణ, లంకా నానాజీతో పాటుగా తమరాన సత్యనారాయణ, అవుగడ్డి వెంకటరమణ, తమరాన రామకృష్ణ, జక్కాన రామునాయుడు, సుర్ల బోడియ్య ఉన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

తొండంగి, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆది నుంచి రైతులకు కూటమి ప్రభుత్వం అండగా నిలిచి వారి ఆర్థిక ఎదుగుదలకు ఎంతో తోడ్పడిందని ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. బుధవారం ఆనూరులో అన్న దాత సుఖీభవ పథకంపై ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రైతులను ఆదుకునేందుకు అన్నదాత సుఖీభవ పథంకం ఎంతో ఉపయోగపడిందన్నారు. మండలంలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా 8422 మంది రైతలకు రూ.5.49 కోట్ల ప్రయోజనం చేకూరిందన్నారు. ప్రభుత్వం నిరంతరం రైతుల సంక్షేమం కోసం ఆలోచిస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అవగాహన చేసుకుని ఆశీర్వదించాలన్నారు. మరిన్ని రైతు సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. టీడీపీ సీనియర్ నేతలు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, జిల్లా మత్స్యకార అధ్యక్షుడు కోడ వెంకట రమణ, ఆత్మ చైర్మన్ నరహరిశెట్టి సూర్యప్రకాష్, ఎంపీడీవో నవీన్ ఉన్నారు.

ఉపాధి పనుల పర్యవేక్షణపై గ్రామసభలు



మాట్లాడుతున్న ఎంపీపీ బుజ్జి

ఏలేశ్వరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకాన్ని లోటుపాట్లు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అధికారులకు సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో ఎస్ఆర్‌పీ రాజు మాట్లాడుతూ నేటి నుంచి జనవరి 4 వరకు ఉపాధి హామీ పథకంపై గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఎంపీ డీవో రవికుమార్ వర్మ, ఎంపీటీసీ సభ్యులు కొప్పుల బాబ్జి, పసల సూరిబాబు, ఏపీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

భజన కళాకారులకు సన్మానం



శ్రీశైలంలో అభినందిస్తున్న దృశ్యం

కోటనందూరు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు ధర్మపథం పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు పాతకొట్టాంకి చెందిన శ్రీసీతారామ భజన బృందానికి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్‌రావు నుంచి ఆదేశాలు రావడంతో దేవస్థానంలో శివస్తుతి అనే భజన కార్యక్రమం చేట్టారు. అందులో శివపార్వతి, గణపతి, కుమారస్వామి, వీరభద్రుడు, కాలబైరవుడు సంబంధించిన పాటలు పాడుతూ భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులను ఆకట్టుకోవడంతో భజన బృందం గురువు మేడసాని రాజు బృందాన్ని అభినందించి ప్రశంస పత్రం అందించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

శంఖవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు డాక్టర్ వనం సత్యప్రియ అన్నారు. సీతారామ కళాశాల అధ్వర్యంలో కొంతంగి కొత్తూరులో నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ శిబిరంలో విద్యార్థులకు గురువారం యోగా అభ్యాసం చేయించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజూ గంటపాటు సాధన చేయడం ఆరోగ్యానికి ఎంతో మేలన్నారు. ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు మొగలి అక్కారావు, వెంకటేశ్వరరావు, సిబ్బంది నెల్లిపూడి కృష్ణ పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న నారా ఫౌండేషన్ నేత జగదీష్

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఎన్నికల్లో విజయం సాధించాలని మొక్కుకున్న నియోజకవర్గ నారా ఫౌండేషన్ అధ్యక్షుడు అడపా జగదీష్ ఆ మొక్కును చెల్లించారు. అయ్యప్ప దీక్ష ముగించుకుని శబరిమల నుంచి నియోజకవర్గానికి విచ్చేసిన ఆయన గురువారం ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేశారు.

రైతన్నా మీ కోసం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

మోతుగూడెం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొడ్డగండి గ్రామ పంచాయ తీ గ్రామాల్లో గడచిన రెండు రోజులుగా రైతన్నా మీ కోసం కార్యక్రమం, వివిధ గ్రామాలలో కొనసాగుతోంది. గురువారం మంగంపాడు గ్రామంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతి థిగా ఎంపీటీసీ వెంకటరమణ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం మండల వ్యవసాయాధికారిని ఆధ్వర్యంలో మండలంలోని 17 పంచాయతీలకుగాను 17మంది మండలస్థాయి అధికారులను టీమ్ లీడర్స్‌గా ఎంపికచేసి వారి ఆధీనంలో కిందిస్థాయి ఉద్యోగులను సహాయకులుగా ఏర్పాటు చేశారు.

మండల బూత్ కమిటీ పరిశీలకుడిగా కొండబాబు

కోటనందూరు, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): కోటనందూరు మండల బూత్ కమిటీ పరిశీలకుడిగా జగ్గంపేట గ్రామానికి చెందిన రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌డైరెక్టర్ కొత్త కొండబాబుకు టీడీపీ బాధ్యతలు అప్పగించింది. మండలంలోని సీనియర్ నేతలైన లోవ దేవస్థానం మాజీ చైర్మన్ గాడి రాజుబాబు, మండల అధ్యకుడు పోతల సూరిబాబుతో చర్చించారు. కార్యక్రమంలో చిరంజీవిరాజు, తుని నియోజకవర్గ టీడీపీ ప్రధాన కార్యదర్శి వెలగా వెంకటకృష్ణారావు, మండల ప్రధాన కార్యదర్శి సామినీడి కృష్ణార్జున, రుత్తల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదివాసీలకు
రక్షణ కల్పించాలి

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో వెంకటనగరం గ్రామంలో గురువారం లిబరేషన్ కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. ఈ ఆందోళనకు నాయకత్వం వహించిన లిబరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు మానుకొండ లచ్చబాబు మాట్లాడారు. కడపలో డిసెంబరు 6, 7 తేదీల్లో జరిగే లిబరేషన్ 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని వక్తలు కోరారు. వెంకటనగరం సంఘ అధ్యక్షులు మన్నెపల్లి వెంకటరమణ, సంఘ నాయకులు రేచుకట్ల లక్ష్మి, బండి రత్నం, బండి లక్ష్మి, రేచుకట్ల చక్రమ్మ, రేచుకట్ల నాగమణి, దేవిపాల్గొన్నారు.

ఎమ్మెల్యే , ఎంపీ పర్యటనను విజయవంతం చేయండి

రౌతులపూడి, నవంబరు 27(ఆంధ్రజ్యోతి): ధారపల్లిలో నేడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, ఎంపీ తంగెళ్ల ఉదయశ్రీనివాస్ పర్యటించనున్నట్టు టీడీపీ మండల అధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, కత్తిపూడి సత్రం చైర్మన్ సోమరౌతు చంద్రమౌళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందుగా నూతన రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ప్రజా దర్బార్‌లో పాల్గొంటారని తెలిపారు. వీటికి కూటమి నాయకులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.



శరభవరం సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు

మాక్ అసెంబ్లీ సభాపతికి ఎమ్మెల్యే అభినందన



విద్యార్థిని స్వాతిని అభినందిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, తదితరులు

శంఖవరం, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విద్యాశాఖ నిర్వహించిన మాక్ అసెంబ్లీ సభాపతి ప్రాత పోషించిన సైపిరెడ్డి స్వాతిని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అభినందించారు. గురువారం టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, బద్ది రామారావు ఆధ్వర్యంలో విద్యార్థిని, పాఠశాల సిబ్బంది సత్కరించి అభినందనలు తెలిపారు. విద్యార్థులలో ఆత్మవిశ్వాసం నింపి వారిలో నైపుణ్యాలను వెలికి తీసేందుకు మంత్రి లోకేష్ ఈ మాక్ అసెంబ్లీ నిర్వహించారని, ఇందులో సభాపతిగా తమ నియోజకవర్గ విద్యార్థికి అవకాశం రావడం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే తెలిపారు. శాసనసభ నిర్వహణ ఎలా ఉందనే విషయం తెలియడంతో పాటూ ముఖ్యమంతి, మంత్రుల మధ్యలో బెరుకు లేకుండా మాట్లాడటంతో మరింత ఆత్మవిశ్వాసం పెరిగిందని స్వాతి తెలిపింది. కార్యక్రమంలో అరిగెల జగదీష్, మోడల్ స్కూల్ పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరంలో చిన్నతరహా పరిశ్రమ ప్రారంభం



యాగంలో పాల్గొన్న స్వామిజీలు

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ధర్మవరంలో నిర్మించిన పాండురంగ చిన్నతరహా పీవీసీ పరిశ్రమను గురువారం రాచపల్లి అరుణాచల క్షేత్ర వ్యవస్థాపకులు స్వామి రామానంద ప్రారంభించారు. ప్రత్తిపాడు ప్రాంతంలో ఇలాంటి పరిశ్రమలు వినియోగదారులకు ఎంతో ప్రయోజనం చేకూరనుందని తెలిపారు. అనంతరం పరిశ్రమ ప్రాంగణంలో గణపతి హోమంతో పాటు పలు హోమాలను దాట్ల రంగరాజు కుటుంబీకులు నిర్వహించారు.కార్యక్రమంలో నర్సాపురం పార్లమెంట్ పరిశీలకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, అన్నమ య్య కళాక్షేత్రం రాష్ట్ర అధ్యక్షుడు సానా నూకరాజు నాయుడు, భీమవరం ఎంపీపీ పేరుచర్ల నరసింహరాజు, దెందుకూరి రామకృష్ణరాజు, దాట్ల వంశీరాజు, దాట్ల రోహిత్ రాజు, సిద్దా పెద్దకాపు, అద్దేపల్లి రాజా, గొల్లప్రోలు మం డలం జనసేన నాయకుడు రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా వాయిదా

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు జిల్లా పరిషత్ హైస్కూల్లో 29న నిర్వహించనున్న జాబ్‌మేళాను వాయిదా వేసినట్లు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ గురువారం తెలిపారు. త్వరలో ఎప్పుడు నిర్వహించేది మళ్లీ తెలియజేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో దిగువ ధారపల్లి గ్రామంలో రెండున్నర కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి రూ.1.95 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని శుక్రవారం ఉదయం ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

శరభవరంలో సంతాన జాగరణ

ప్రత్తిపాడు, నవంబరు 27 (ఆంధ్రజ్యోతి): శరభవరం నాగేంద్రస్వామి, వల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆల యాల వద్ద గురువారం సంతాన జాగరణ నిర్వహించారు. ఆలయం వద్ద అన్నదానంతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు.